జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 2

పక్షపత్రిక

జనవరి16-31, 2012



## లోక్‌పాల్ ఎలా సాధించుకుందాం ?





కృష్ణా జిల్లా మైలవరం నియోజకవర్గంలో కల్తీ సారా బాధితులను పరామర్శిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్



సారా బాధితులతో సమావేశం



విజయవాడ పుస్తక ప్రదర్శనలో డా॥ జేపీ




గుంటూరు జిల్లా వడ్లమూడిలో జాతీయ యువజనోత్సవాల ముగింపు సమావేశంలో డా॥ జేపీ

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జనవరి16-31, 2012

సంపుటి - 3 సంచిక - 2

## లోపలి పేజీల్లో...

లోక్‌పాల్ ఎలా సాధించుకుందాం?...........5

లోక్‌పాల్ బిల్లు-ఓడింది ప్రజలే..................10

గృహహింస చట్టం అంతంత మాత్రం.........11

అన్నా...మీడియా.................................12

దళారి రాజ్యం పోవాలి..........................15

మల్టీబ్రాండ్ రిటైల్ రంగం ప్రభావం............19

వంటిమామిడిలో ఏం జరుగుతోందంటే......21

ఈశాన్యన మెరిసే మాణిక్యం....................23

లక్ష్యం చేరని మాతాశిశు సంరక్షణ............24

ఆదర్శ గురువు శ్రీనారాయణగురు..............25

లోక్‌సత్తా పార్టీ విధానాలకు దర్పణం.........29

జిల్లాలలో పార్టీ కార్యకలాపాలు...............30

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# అవినీతి : రిపబ్లిక్ ముందున్న తక్షణ సవాలు

## సంపాదకీయం

జనవరి 26న 63వ రిపబ్లిక్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మునుపెన్నడూ లేని స్థాయిలో అవినీతి దేశవ్యాపిత సమస్యగా ముందుకొచ్చింది. అవినీతి ఆది నుండి మన రిపబ్లిక్ తెలిసిందే. అది ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరిగి పెద్దదైంది. ఇప్పుడు అది మన బడ్జెట్ సొమ్మును కొల్లగొడుతున్నది. సహజ వనరుల్ని లూటీ చేస్తున్నది. అభివృద్ధిని కబళిస్తున్నది. మొత్తం రాజకీయ వ్యవస్థలు, పాలనా వ్యవస్థలు ఈ అవినీతి వలయంలో మునిగితేలుతున్నాయి.

మన దేశంలో ఆర్థికాభివృద్ధి గణనీయంగానే పెరుగుతున్నది. ప్రపంచదేశాలతో పోటీపడగల స్థితికి ఎదిగింది. ఏటా లక్షల కోట్లు ప్రజా ప్రయోజనాల పేరుతో ఖర్చు అవుతున్నది. కాని నిజమైన అభివృద్ధి సాధించడంలో మనం ఎంతో వెనకబడి వున్నాం. అందరికీ మంచి ప్రమాణాల విద్య ఇంకా ఒక పెనుసవాలుగానే వుండిపోయింది. వైద్య, ఆరోగ్యసేవలు ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలివుంది. నైపుణ్యాలు లేని యువత ఇంకా ఉపాధికి దూరంగానే వుండిపోతున్నారు. వీటన్నింటికీ ఇప్పుడు అవినీతే అవరోధంగా తయారైంది.

ఇటీవలకాలంలో అవినీతికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం వెల్లువెత్తింది. దీంతో బలమైనలోక్‌పాల్ చట్టం కోసం అన్ని పార్టీలు కట్టుబడి వున్నట్టు ప్రకటించాయి. కాని తీరా పార్లమెంటులో చట్టం ఆమోదించాల్సివచ్చేటప్పుడు అందరూ ఫ్లేటుఫిరాయించారు. ఇప్పుడు లోక్‌పాల్ బిల్లు త్రిశంకు స్వర్గంలో వుంది. దీనికి మోక్షం కల్పించి తీరాలి. బాధ్యత గల రాజకీయ పార్టీలు సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు దూరంగా వ్యవహరించాలి. పరస్పర నిందారోపణలు కట్టి పెట్టాలి. లోక్‌పాల్ బిల్లుకు మోక్షం కల్పించడానికి తగిన పట్టు విడుపుల్ని, చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. అందరూ ఆలోచించాల్సిన అంశాలపైనా, ఆచారణాత్మకమైన పరిష్కారాలతో డా॥జయప్రకాష్ నారాయణ్ రాసిన వ్యాసాన్ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. లోక్‌పాల్ చట్టరూపం ధరించడానికి ఇది ప్రాతిపదిక అవుతుందని ఆశిస్తున్నాం.

బలమైన చట్టాలు జాతీయ, రాష్ట్రస్థాయిలలో వుంటే అవినీతిపరుల్ని శిక్షించడం, వారి ఆస్తుల్ని జప్తు చెయ్యడం సాధ్యం అవుతుంది. అయితే చట్టం ఒక్కటే సరిపోదు. అవినీతి పరుల్ని సృష్టిస్తున్న వ్యవస్థల్ని పూర్తిగా క్షాళన చెయ్యాలి. మన రాజకీయ వ్యవస్థ అవినీతికి నిలయంగానూ, మూలంగానూ వుంది. మన ఎన్నికల వ్యవస్థ దానిని పెంచి పోషిస్తున్నది. నియోజక వర్గంలో గెలుపు మీదే ఆధారపడిన ఎన్నికల వ్యవస్థ కావడంతో గెలుపుకోసం అభ్యర్థులు కోట్లు గుమ్మరిస్తున్నారు. గెలిచిన తర్వాత దండుకోవడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఇలా ఈ ఎన్నికల వ్యవస్థ ధనరాజకీయాన్ని ప్రోత్సహిస్తున్నది. ఇప్పుడు కోటేశ్వరులకీ, అడ్డదారుల్లో సంపాదించిన వారికి తప్ప సామాన్యులకి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు పూర్తిగా లేకుండా పోయాయి. రాజకీయం అవినీతి లేకుండా మనుగడసాగించలేని స్థితికి చేరింది. దీనిని ఛేదించాలి. ఈ ఎన్నికల వ్యవస్థని పూర్తిగా సంస్కరించాలి. కొత్త ఎన్నికల వ్యవస్థకి, దామాషా పద్ధతి వ్యవస్థకి ద్వారాలు తెరవాలి. దానితో పాటు రాజకీయ పార్టీల నియంత్రణకు చట్టం అవసరం. లేకపోతే అన్నీ కుటుంబ పార్టీలుగా, పార్టీ నిధుల పేరుతో అవినీతి చుట్టూ తిరిగే పార్టీలుగా మిగులుతాయి. అవినీతి మన రిపబ్లిక్ ముందున్న తక్షణ సవాలు. లోక్‌పాల్ చట్టం ద్వారా, కొత్త ఎన్నికల వ్యవస్థద్వారా, పార్టీల నియంత్రణ చట్టం ద్వారా దీనిని అరికట్టడానికి అందరూ ఉద్యుక్తులు కావాలి. ■




ఇండియన్ ఇంక్ సౌజన్యంతో

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034

**ఫోన్ నంబర్లు :**
**040-23311817, 23311819, 23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి.*
*సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311817**
*సెల్ : 80085 07934*

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# లోక్‌పాల్ ఎలా సాధించుకుందాం?



డా॥జయప్రకాష్‌నారాయణ్

బలమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల, అత్యున్నతస్థాయి అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పాటు ఊరించి దూరం కావటంతో 2011 సర్వత్రా అసంతృప్తిని మిగిల్చింది. సహజంగానే, ఒకరి మీద ఇంకొకరు పెద్దఎత్తున నిందలు వేసుకోవటం, వేలెత్తి చూపించుకోవటం జరుగుతోంది. అసలు ఎక్కడ తప్పు జరిగింది, తప్పిదాల్ని సరిచేయటానికి మనం ఏం చేయగలం?

అవినీతికి పాల్పడటమో, తప్పుచేయటమో చేసినందుకు ప్రభుత్వంలో ఉన్న రాజకీయనేతలు, శాసనకర్తలు, ఉన్నతస్థాయి అధికారులపై త్వరితగతిన విచారణ చేపట్టి, ఖచ్చితంగా శిక్షించేందుకు ఉన్నతస్థాయి అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేసేలా శాసననిర్మాతల్ని ఒప్పించటం అన్నీ అనుకూలంగా ఉన్న పరిస్థితులలో కూడా కష్టం. తమనితామే శిక్షించుకునే ఏర్పాట్లని ఏ వ్యవస్థా అంత తొందరగా అంగీకరించదు! అందుకు చాలా దృఢసంకల్పం, నైపుణ్యం, అందరి వాదనలనూ సమన్వయం చేయటం, ఆచరణాత్మక దృక్పథం అవసరం. ఈ విషయంలో ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, ప్రతిపక్షం, పౌరసమాజం– ఇలా భాగస్వాములందరూ తప్పులు చేశారు. బిల్లులో మంచి నిబంధనలు ఉన్నా కూడా, ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించేలా కొన్ని కీలక నిబంధనలను చేర్చటంలో, భాగస్వాములను కలుపుకునిపోవటంలో, బిల్లులోని బలమైన అంశాలను సమర్థవంతంగా తెలియచేయటంలో ప్రభుత్వం విఫలమైంది. దాంతో ప్రభుత్వ వ్యవహారశైలి కేవలం ప్రతిస్పందనల తరహాలో ఉదాసీనంగా, కాలయాపనతో జాప్యం చేస్తున్నట్టు సాగింది. బిల్లును వ్యతిరేకిస్తున్న పార్టీలు రంధ్రాన్వేషణలతో ప్రజల్ని, మీడియా దృష్టిని ఆకర్షించి ప్రచారం పొందేందుకు పోటీ పడ్డాయి. "అసాధ్యమైన అద్భుతం సుసాధ్యమైన మంచికి శత్రువు" అన్న రీతిలో వ్యవహరించాయి. "రాష్ట్రాలపై దాడి" లాంటి పక్కదోవ పట్టించే వాదనలతో చర్చలో పైచేయి సాధించేందుకు, బిల్లును కాలరాసేందుకు ప్రయత్నించి పార్లమెంటు ఇచ్చిన హామీ నుంచి వెనక్కిమళ్లాయి. పౌరసమాజం



ఆ సంక్లిష్టతల్ని అర్థంచేసుకుని గౌరవాన్ని, అవగాహనని ప్రదర్శించటానికి బదులు... ఎప్పటికప్పుడు కొత్త లక్ష్యాల్ని ముందుకుతెస్తూ, బాహాటంగానే ద్వేషపూరిత, శత్రుత్వ వైఖరితో వ్యవహరించారు. అందరూ స్థిమితంగా, లోతుగా సమీక్షించుకోవాల్సిన సమయమిది.

పార్లమెంటు ముందున్న లోక్‌పాల్, లోకాయుక్తల బిల్లులో కొన్ని లోపాలున్నాయి. అంబుడ్స్‌మన్‌కు సొంతంగా విచారణ చేపట్టే (సుమోటో) అధికారాలు లేవు, సొంత పరిశోధనాసంస్థ లేదు. లోక్‌పాల్/ లోకాయుక్తల పర్యవేక్షణలో లేని కేసుల విషయంలో విచారణ చేపట్టటానికి ప్రభుత్వ ముందస్తు అనుమతి కావలసి ఉండటం (ఢిల్లీ ప్రత్యేక పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 6ఎ), ప్రాసిక్యూషన్‌కు ముందస్తు అనుమతి అవసరం ఉండటం (అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19, సి.ఆర్.పి.సిలోని సెక్షన్ 197) వంటి అవరోధాలు ఇంకా సి.బి.ఐ, ఎ.సి.బిలకు అలాగే కొనసాగుతున్నాయి. డైరెక్టర్, ఇతర అధికారుల నియామకాలలో, పర్యవేక్షణ, మార్గదర్శకత్వం వంటి అంశాలలో రాష్ట్ర ఎ.సి.బిలు పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయి. ఈ బలహీనతల్ని సరిచేయాల్సివుంది.

కానీ మొత్తంగా చూస్తే, బలమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల అంబుడ్స్‌మను ఈ బిల్లు ప్రతిపాదించింది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎం.పిలు, ఎం.ఎల్.ఏలు, సీనియర్ అధికారులు- అందరినీ లోక్‌పాల్/లోకాయుక్త పరిధిలోకి తీసుకొచ్చారు. సి.వి.సి ద్వారా దిగువస్థాయి అధికారులను, ఉద్యోగులను కూడా లోక్‌పాల్ పరిధిలోకి తీసుకొచ్చారు. సి.బి.ఐ డైరెక్టర్ నియామకాన్ని ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత (ఎల్ఓపి)తోపాటు భారత ప్రధాన న్యాయమూర్తి ఉన్న కమిటీ ద్వారా చేసే ఏర్పాటు ఉంది. ముగ్గురిలో ప్రభుత్వానికి ఒక ఓటు మాత్రమే ఉంటుంది. సి.బి.ఐ అధికారుల విషయానికొస్తే, మొత్తం సి.వి.సిలోని ముగ్గురు సభ్యులు, ఇద్దరు ప్రభుత్వ కార్యదర్శులు కలిసి, సి.బి.ఐ డైరెక్టర్‌తో సంప్రదించిన అనంతరం వారిని నియమిస్తారు. లోక్‌పాల్/ లోకాయుక్త ఆదేశించే అన్ని విచారణలకు సంబంధించి సి.బి.ఐ, ఎ.సి.బి లోక్‌పాల్/లోకాయుక్తకే జవాబుదారీగా ఉంటాయి. కేసుల ప్రాసిక్యూషన్, ప్రత్యేక కోర్టుల ఏర్పాటు లోక్‌పాల్/ లోకాయుక్త పరిధిలో ఉంటాయి. లోక్‌పాల్/లోకాయుక్త ద్వారా ఆస్తుల స్వాధీనం, ప్రత్యేక కోర్టుల ద్వారా ఆస్తుల జప్తు ఏర్పాటు బిల్లులో పొందుపరిచారు. లోక్‌పాల్/లోకాయుక్త నియామకం, తొలగింపునకు సంబంధించి ఉన్న నిబంధనలు వాటి స్వతంత్రప్రతిపత్తికి పూర్తి హామీనిస్తాయి. వీటితోపాటు ఉన్న ఇతర నిబంధనలు అంబుడ్స్‌మన్‌కి సిసలైన, చాలా ప్రభావశీలమైన అధికారాన్ని ఇచ్చాయి.

ఇది బలహీనమైన, పక్షపాతపూరితమైన లోక్‌పాల్/లోకాయుక్త బిల్లు అనే వాదన వాస్తవాల్ని వదిలేసి కేవలం రాజకీయపరంగా చేస్తున్న ఊకదంపుడు విమర్శ మాత్రమే. ఇది చాలా విచారకర పరిణామం. పార్లమెంటులో జరిగిన చర్చలో ముఖ్యంగా రెండు అంశాలు హోరెత్తి ఆ బిల్లును పక్కదోవ పట్టించాయి. అవి- సి.బి.ఐకి స్వతంత్ర ప్రతిపత్తి, లోకాయుక్త నిబంధనల రాజ్యాంగబద్ధత. ప్రతిష్ఠంభనను తొలగించేందుకు ఆ రెండు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించటం అవసరం. ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ సి.బి.ఐ డైరెక్టర్‌ను నియమిస్తుంది. ఇది ఎన్నికల కమిషన్, కాగ్, యు.పి.ఎస్.సి వంటి రాజ్యాంగసంస్థలకు కూడా వర్తించని అసాధారణ నిబంధన. ఎస్.పి, ఆపైన అధికారులందరి నియామకాల్ని డైరెక్టర్‌తో సంప్రదించి... సి.వి.సిలోని ముగ్గురు సభ్యులు, ఇద్దరు ప్రభుత్వ కార్యదర్శులు చేస్తారు. సి.బి.ఐ సాధారణ పర్యవేక్షణను సి.వి.సి చేస్తుంది. లోక్‌పాల్ పంపిన కేసులకు సంబంధించి, లోక్‌పాల్‌కు సి.బి.ఐ నివేదిక ఇస్తుంది. తనకు పంపిన కేసులలో సి.వి.సి కూడా లోక్‌పాల్‌కే నివేదిక ఇస్తుంది. ఈ నిబంధనలన్నిటితోపాటు తన సొంత అధికారులపైన, సి.బి.ఐ, సి.వి.సి సహా అన్ని అవినీతి నిరోధక సంస్థల అధికారుల, ఉద్యోగుల పైన వచ్చిన అవినీతి ఆరోపణల మీద విచారణ చేపట్టేందుకు సెక్షన్ 38 లోక్‌పాల్‌కు అసాధారణ అధికారాల్నిస్తుంది. ఈ సంస్థలలో తప్పు చేసే అధికారులపై ఉద్యోగం నుంచి తొలగింపు, ప్రాసిక్యూషన్, క్రమశిక్షణా చర్య తీసుకునే అధికారాలు లోక్‌పాల్‌కు ఉన్నాయి.

ఈ నిబంధనలన్నిటినీ పరిశీలిస్తే, సి.బి.ఐ ప్రభుత్వ నేతృత్వంలో ఉందనటం చాలా సంకుచిత వాదన అని అర్థమవుతుంది. ఇక పాలనాసంబంధ వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యంపై విస్తృతంగా చేస్తున్న వాదన రెండు అంశాలకు పరిమితమైనది. అవి-బడ్జెట్, సిబ్బంది సర్వీసు వ్యవహారాల నియంత్రణ. ఈ రెంటినీ కూడా లోతుగా పరిశీలించి

అర్థంచేసుకోవాలి. భవిష్యత్తు అవసరాలలో సి.బి.ఐకున్న అసలైన సవాలు ప్రభుత్వ నియంత్రణ కాబోదు. సామర్థ్యాన్ని నిర్మించుకోవటమే అసలైన సవాలు. జాతీయస్థాయి వరకూ విస్తరించివున్న సి.బి.ఐలో కేవలం 6000మంది సిబ్బంది ఉన్నారు. వారిలో 2000మంది మాత్రమే కేసులు పరిశోధించేవారు. సి.బి.ఐ నమోదు చేస్తున్న కేసుల సంఖ్య ఏటా 1000వరకూ మాత్రమే ఉంటోంది. జాతీయస్థాయిలో ఎదుర్కొంటున్న భయంకరమైన అవినీతి సమస్య దృష్ట్యా చూస్తే ఈ సంఖ్య బహుస్వల్పం. సిబ్బంది కొరత, మౌలికవసతులు, సామర్థ్యం విషయాలలో ఎ.సి.బిల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. నానాటికీ విస్తరిస్తున్న అవినీతి సవాలును ఎదుర్కొని దేశానికి సమర్థవంతంగా సేవ చేయటానికి సి.బి.ఐని వచ్చే పదేళ్లలో దాదాపు పదిరెట్లు విస్తరించాల్సి ఉంటుంది. నిఘా యంత్రాంగం, ఫోరెన్సిక్ లాబరేటరీలు, సాంకేతిక సదుపాయాలతోపాటు అవసరాన్ని బట్టి ఎక్కడికైనా చేరుకోగలిగేందుకు కావలసిన మౌలిక సదుపాయాల్ని కల్పించాలి. అదేతరహాలో రాష్ట్ర ఎ.సి.బిలలో సామర్థ్యాన్ని పెంచటం అవసరం. వీటన్నిటికీ బడ్జెట్ కేటాయింపులు కావాలి. పార్లమెంటు, ప్రభుత్వం చేతులో ఉండే బడ్జెట్‌లో కేటాయింపులు చేసి ఆ సంస్థలను విస్తరించి, వాటన్నిటికీ తగినన్ని వనరులు అందించేందుకు దృఢసంకల్పం, నిబద్ధత కావాలి. అమలు చేసే సంస్థలు పటిష్టంగా, ప్రభావశీలంగా లేకుండా ప్రపంచంలోని చట్టాలన్నిటినీ కలిపినా పరిస్థితిని మెరుగుపరచలేవు. ప్రత్యేక సిబ్బంది నియంత్రణకు సంబంధించి, ప్రభుత్వ పాత్ర అక్కర్లేదని తోసిపుచ్చలేం. ఎందుకంటే, వివిధ కోణాల నుంచి, వివిధ ఇతర ఏజెన్సీల నుంచి వచ్చే అధికారులు సి.బి.ఐలో ఉంటారు. అఖిలభారత సర్వీసులకు చెందినవారు కాబట్టి సీనియర్ ఐ.పి.ఎస్ అధికారులను కూడా రాష్ట్రాల నుంచి తీసుకుంటారు. ఫలితంగా, సమన్వయం, సీనియారిటీ, ఎన్‌క్యేడర్‌మెంట్, అధికారుల అందుబాటు, రాష్ట్రాల, మాతృసంస్థల ఆమోదం వంటి అంశాలను ప్రభుత్వం మాత్రమే నిర్వహించగలదు. కాబట్టి కొత్త బిల్లులో సి.బి.ఐకి స్వతంత్ర ప్రతిపత్తిలేదు అనే వాదన బలహీనమైనది, చర్చకు నిలబడదు. బలమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల పరిశోధనా సంస్థను ఏర్పాటు చేయటంలో మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకుంటే, పాకిస్తాన్‌లోని ఐఎస్‌ఐలాగా సొంత ఎజెండా కలిగి, ఎవరికీ బాధ్యత వహించని ఒక సమాంతర ప్రభుత్వాన్ని సృష్టించినవారమవుతాం. కానీ అవినీతి కేసులలో ఢిల్లీ ప్రత్యేక పోలీసు చట్టం లోని సెక్షన్ 6ఎ, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19ని, సీఆర్‌పీసీ సెక్షన్ 197ను కొనసాగించటంలో అర్థం లేదు. ఈ సెక్షన్లను తొలగించాలి లేదా సి.బి.ఐ తన విధినిర్వహణలో అవరోధాలను ఎదుర్కొనకుండా వాటిని సవరించాలి. అయినప్పటికీ ప్రాసిక్యూషన్‌కు ముందస్తు అనుమతి కావాలనుకుంటే, ఆ అధికారాన్ని లోక్‌పాల్‌కు అప్పచెప్పవచ్చు. ఈ ఏర్పాట్లు సి.బి.ఐ పూర్తి స్వతంత్ర ప్రతిపత్తికి గ్యారంటీనిస్తాయి.

సి.బి.ఐపై పర్యవేక్షణ విషయంలో రెండు బలమైన అభిప్రాయాలున్నట్టు కనిపిస్తోంది. సి.బి.ఐని ఒకే, ఏకీకృత లోక్‌పాల్ పర్యవేక్షణలో ఉంచాలని చాలామంది వాదిస్తున్నారు. ఎక్కువ అంశాలకు సంబంధించి సి.వి.సి పరిధిలో, లోక్‌పాల్ రిఫర్ చేసే కేసులకు సంబంధించి ఆ అంబుడ్స్‌మన్ పరిధిలో... ఇలా బహుళ పర్యవేక్షణలో సి.బి.ఐ ఉండకూడదన్నది వారి అభిప్రాయం. కానీ జవాబుదారీతనంలేని ఏకరూప సంస్థ వల్ల తలెత్తే విశృంఖల, ప్రమాదకర ధోరణుల పట్ల ప్రభుత్వం, చాలా పార్టీలు ఆందోళన చెందుతున్నట్టు కనిపిస్తోంది. అలాగే పార్లమెంటు ప్రతిష్ఠ, పార్లమెంటు బయటి శక్తుల చేతిలో కీలుబొమ్మగా మారకూడదన్న సభ్యుల ఆకాంక్ష వంటి అంశాలు కూడా ఉన్నాయి. ఫలితంగానే... కొంత గందరగోళంగా కనిపించినా, సి.బి.ఐకి సంబంధించి చాలా సంస్థాగత ఏర్పాట్లని ప్రతిపాదించారు: ప్రభుత్వం, ప్రతిపక్షం, న్యాయవ్యవస్థ సమాన భాగస్వామ్యంతో ఉన్నత స్థాయి కమిటీతో సి.బి.ఐ డైరెక్టర్ నియామకం, ఇతర సీనియర్ అధికారుల నియామకానికి ప్రస్తుత నిబంధనలను కొనసాగించటం, మొత్తంగా సి.వి.సి పర్యవేక్షణ, సి.బి.ఐకి మార్గదర్శకత్వం చేస్తూ తాను రిఫర్ చేసిన కేసుల విషయంలో సి.బి.ఐని జవాబుదారీ చేసే అధికారం లోక్‌పాల్‌కు ఉండటం, సి.బి.ఐలో అవినీతి అంశాలపై చర్యలకు లోక్‌పాల్‌కు విశేషాధికారాలు వున్నాయి. అయినా సి.బి.ఐకి పూర్తి స్వయంప్రతిపత్తి ఉంటుందని, ఆ సంస్థ ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మగా ఉండదని దేశ ప్రజలకు విశ్వాసాన్ని కలిగించే బాధ్యత ప్రభుత్వం మీద, పార్లమెంటు మీద ఉంది. సి.వి.సి సభ్యులందరినీ లోక్‌పాల్‌లో ఎక్స్–అఫీషియో సభ్యులుగా చేయటం ద్వారా సి.బి.ఐ స్వతంత్ర ప్రతిపత్తి మీద ఉన్న అనుమానాలను చాలా సులభంగా నివృత్తి చేయవచ్చు. సి.వి.సి

చట్టం కింద నిర్దేశించినట్టు సి.వి.సి ప్రత్యేక సంస్థగానే కొనసాగుతుంది. కానీ సి.వి.సి ఛైర్మన్, సభ్యులు లోక్‌పాల్ ఎక్స్–అఫీషియో సభ్యులుగా ఉంటారు. వారిని నియమించటం, తొలగించటం లోక్‌పాల్ తరహాలోనే ఉంటుంది. ఆ విధంగా సి.వి.సి, లోక్‌పాల్‌ను సంధానం చేయవచ్చు. అయితే, సి.బి.ఐపై పర్యవేక్షణ, విజిలెన్స్, అవినీతి కేసులలో ప్రభుత్వానికి సలహాలు, అన్ని ప్రభుత్వ సంస్థలలో విజిలెన్స్ యంత్రాంగాన్ని నియంత్రించటం వంటి ప్రత్యేక బాధ్యతలు సి.వి.సితోనే ఉంటాయి. సి.వి.సి సభ్యుల అర్హత ప్రాతిపదికలు ఇప్పుడున్నట్టే కొనసాగుతాయి. అధికారులు ఏ నేపథ్యంలో పనిచేస్తుంటారు, నిర్ణయాలు ఎలా తీసుకుంటారు అనే అవగాహన కలిగివుండేందుకు వీలుగా ఒక సివిల్ సర్వీసు అధికారిని, ఒక పోలీసు అధికారిని, ఒక బ్యాంకర్ లేదా ఆర్థిక నిపుణుడిని సి.వి.సిలో నియమించే విధానం అలాగే ఉంటుంది. ఈ విధంగా సి.బి.ఐ స్వయంప్రతిపత్తిని కాపాడితే సమస్య పరిష్కారమవుతుంది.

ఇక రాష్ట్రాల హక్కులకు సంబంధించిన అంశం. అంతర్జాతీయ ఒప్పందాలు, తీర్మానాల అమలు విషయంలో రాష్ట్రాల జాబితాలోని అంశాలపై చట్టం చేయటానికి రాజ్యాంగంలోని 253వ అధికరణం పార్లమెంటుకు స్పష్టమైన అధికారాలనిస్తోంది. మే 1, 2011న ఐక్యరాజ్యసమితి అవినీతి వ్యతిరేక తీర్మానాన్ని భారతదేశం ధృవీకరించిన అనంతరం – రాష్ట్రాలకు కూడా వర్తించే ఆయా చట్టాల్ని చేయాల్సిన బాధ్యత పార్లమెంటుదే. కేంద్రానికి ఉండే నిబంధనలే రాష్ట్రాలకూ లోక్‌పాల్ బిల్లులో ప్రతిపాదించారు. ఎటువంటి విచక్షణా లేదు. అదేసమయంలో రాష్ట్రాల అధికారాలు ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలోనే ఉంటాయి, కేంద్రప్రభుత్వానికి బదిలీ కావు. లోకాయుక్త, ఇతర అధికారుల నియామకాలు పూర్తిగా రాష్ట్రాల పరిధిలోనే వుంటాయి. అవినీతి నిరోధక కేసులలో పరిశోధన, ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన యథాక్రమంగా జరిగే అంశాలన్నీ పార్లమెంటు ఉమ్మడి జాబితా పరిధిలోకి... జాబితా 3లోని 1,2 అంశాల కిందకు వస్తాయి. వీటితోపాటు, ఆర్టికల్ 253 ప్రకారం అవినీతి ఆరోపణలున్న అధికారులకు సంబంధించిన అనుబంధ సర్వీస్ విషయాలు ఇప్పుడు పార్లమెంటు ఉమ్మడి జాబితా పరిధిలోకి వస్తాయి. అంతర్జాతీయ ఒప్పందాల అమలులో భాగంగా గతంలో పలు చట్టాలు రూపొందాయి. మనీలాండరింగ్ చట్టం, మానవహక్కుల కమిషన్ చట్టాలు అందుకు ప్రధాన ఉదాహరణలు. సమాచారహక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రాష్ట్రాలకు కూడా వర్తిస్తూ అమలులోకి వచ్చాయి. పార్లమెంటు ఆ విధంగా తన అధికారంతో రాష్ట్రాలకూ చట్టాలు చేసిన సందర్భాలు ఇంతకుముందు స్పష్టంగా ఉన్నాయి. అలాగే నేరన్యాయ చట్టాలు– మన సిఆర్‌పిసి, సీపీసీ, ఎవిడెన్స్ యాక్ట్, ఐపీసీ తదితర చట్టాలన్నీ– పార్లమెంటే చేసి రాష్ట్రాలకు వర్తింపజేసినవే. వీటిలో ఏదీ రాష్ట్రాల హక్కులను కాలరాసింది కాదు. కొన్ని పార్టీల మధ్య అభిప్రాయభేదాలుండటం, పార్లమెంటులో మెజారిటీని పొందటానికి రాజీపడాల్సిన అవసరం దృష్ట్యా లోక్‌సభలో బిల్లులో సవరణ చేసి, రాష్ట్రాల ముందస్తు అంగీకారం తర్వాతే లోకాయుక్త చట్టాన్ని అక్కడ అమలు చేయాలని ఆమోదించారు. ఈ నేపథ్యంలో.. చట్టాన్ని ఆమోదించే రాష్ట్రాలకు మాత్రమే వర్తించేలా ఆ చట్టం చేయడం రాష్ట్రాల హక్కులకు భంగం కలిగిస్తుందనే వాదనలో పస లేదు.

అయినా, ఇప్పుడు మనం ఒక ప్రతిష్టంభనను ఎదుర్కొంటున్నాం. కొన్ని పార్టీల వితండవాదనతో లోక్‌పాల్ చట్టం రావటం ఆలస్యమవుతోంది. ఈ పరిస్థితిని పరిష్కరించేందుకు ఏం చేయాలి? ఇందుకోసం రెండు చర్యలు అవసరం. మొదటిది, చట్టాన్ని ఆరు అంశాలలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అంగీకరించాలి– లోక్‌పాల్/లోకాయుక్తకు సువోటో అధికారాలివ్వటం, లోక్‌పాల్‌కు సొంత నేరపరిశోధనావిభాగం ఏర్పాటు చేయటం, సి.వి.సి సభ్యులను లోక్‌పాల్‌లో ఎక్స్–అఫీషియో సభ్యులుగా చేయటం, ఢిల్లీ ప్రత్యేక పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 6ఎను, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19ని, సి.ఆర్.పి.సిలోని సెక్షన్ 197ను తొలగించటం, సి.బి.ఐ విషయంలో ప్రతిపాదిస్తున్న లేక ఇప్పటికే ఉన్న నిబంధనలను రాష్ట్ర ఎ.సి.బిలకు కూడా వర్తింపచేయటం, స్థానిక ప్రభుత్వాలలో, ప్రతి జిల్లాలో దిగువస్థాయిలో అవినీతిని ఎదుర్కోవటానికి తగినంత సంఖ్యలో స్థానిక అంబుడ్స్‌మన్‌ను లేదా లోకాధికారిలను నియమించుకునేందుకు లోకాయుక్తలకు అధికారాలివ్వటం. ఈ ఆరు నిబంధనలూ నిజమైన స్వతంత్ర ప్రతిపత్తిగల, ప్రభావశీలమైన అవినీతి నిరోధక సంస్థల్ని ఏర్పాటు చేసి అంబుడ్స్‌మన్‌ను పటిష్టంచేస్తాయి. ప్రస్తుతం బిల్లులో ఉన్న ఏర్పాట్లకి, ఇప్పుడు ప్రతిపాదించే ఆరు సవరణలకి వైరుధ్యం ఏమీ ఉండదు. అదేసమయంలో ఆయా సంస్థల నిర్మాణాన్ని ఈ మార్పులు ఏరకంగానూ బలహీనపరచవు. రెండోది, లోకాయుక్త నిబంధనలు చట్టంలో యధాతథంగా కొనసాగాలి.

అయితే సవరించిన సెక్షన్ 1ను మరింత విశదీకరించి... శాసనసభలో తీర్మానం ద్వారా ఆమోదించిన తర్వాతే ఏ రాష్ట్రంలోనైనా లోకాయుక్త, ఎ.సి.బి నిబంధనలు వర్తిస్తాయని నిర్ద్వంద్వంగా ప్రకటించాలి. ఇది తిరోగమన చర్యే అయినా రాష్ట్రాల హక్కుల పేరుతో బిల్లును బలిపెట్టకుండా ప్రాంతీయ పార్టీల మద్దతును కూడగట్టేందుకు తప్పదు. రాజకీయ పార్టీలు– ముఖ్యంగా జాతీయపార్టీలు తమ నిబద్ధతను ఆచరణలో చూపాల్సి ఉంది. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఆ చట్టాన్ని వర్తింపచేయాలి లేదా ఆ రాష్ట్రాలలో అంతకంటే బలమైన చట్టాల్ని అమలు చేయాలి. ఈ చట్రంలో, బలమైన చట్టాల్ని అమలు చేయటానికి రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలి. కేంద్ర చట్టాన్ని అమలు చేసే క్రమంలో రాష్ట్రాలకు వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు, రాష్ట్ర శాసనసభ కొత్త నిబంధనల్ని చేర్చుకోవచ్చు, కేంద్ర చట్టంలో ఉన్న నిబంధనల్ని సవరించుకోవచ్చు లేదా మొత్తంగా కొత్త చట్టాన్నే రాష్ట్రం అమలు చేయవచ్చు. ఆ రకమైన మార్పులన్నిటికీ సెక్షన్ 1 స్పష్టమైన అవకాశాల్ని కల్పిస్తే బిల్లు మీద వ్యతిరేకతని తొలగించవచ్చు.

లోకాయుక్త బిల్లులో ఈ మెరుగుదలలు, రాజీలకు తోడు కొన్ని ఇతర చర్యల్ని కూడా చేపట్టాలి. సేవల్ని అందించటం, ఫిర్యాదుల పరిష్కారం (సిటిజన్స్ ఛార్టర్లు), విజిల్ బ్లోయర్స్ (ప్రజావేగుల) పరిరక్షణ, న్యాయవ్యవస్థ ప్రమాణాలు, జవాబుదారీతనం బిల్లుల్ని లోక్‌పాల్‌తో పాటే చట్టాలుగా చేయాలి. ఇప్పుడు ఇవి పార్లమెంటు ముందు ఉన్నాయి. వీటితోపాటు 2012లో కనీసం మరో మూడు చట్టాలు వస్తాయని మనం నిర్దిష్ట హామీ ఇవ్వాలి. హైకోర్టులలో న్యాయమూర్తుల నియామకానికి, తొలగింపునకు జాతీయ జ్యుడీషియల్ కమిషన్‌ను సంబంధిత రాజ్యాంగ నిబంధనల్ని సవరించటం ద్వారా తీసుకురావాలి. దీనివల్ల ఉన్నత న్యాయవ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. దిగువస్థాయి న్యాయవ్యవస్థలో నియామకాలకు, హైకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో తగినంతమంది అర్హులు అందుబాటులో ఉండేందుకు ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్‌లతో సమానంగా కొత్తగా అఖిల భారత జ్యుడీషియల్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలి. లా కమిషన్ ముసాయిదా బిల్లు, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు (ఎఐఆర్ 1996 ఎస్‌సి 2005) ప్రాతిపదికన స్మగ్లర్ల నియంత్రణ చట్టం, 1976 తరహాలో అవినీతి ప్రజాసేవకుల ఆస్తుల్ని జప్తుచేయటానికి శక్తివంతమైన, ప్రభావవంతమైన చట్టాన్ని తీసుకురావాలి. లోక్‌పాల్, లోకాయుక్తల చట్టంతోపాటు ఈ చట్టాల్ని కూడా తీసుకొస్తే, దృఢమైన, స్వతంత్రప్రతిపత్తిగల, చెక్కుచెదరని, ప్రభావశీలమైన అవినీతి నిరోధక వ్యవస్థను రూపొందించుకోగలం.

లోక్‌పాల్, లోకాయుక్తపై వివాదాస్పద అంశాలను పరిష్కరించుకోవటానికి సమయం పడుతుందనుకుంటే, కాంగ్రెస్, బి.జె.పిలు ఆ ఘర్షణను పక్కనపెట్టి తొలుత రాజ్యాంగ సవరణను ఆమోదించాలి. లోక్‌పాల్, లోకాయుక్తలకు స్వతంత్ర ప్రతిపత్తి, ప్రభావశీలత నిబంధలను స్థూలంగా పేర్కొంటూ, లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ రెండు పార్టీలూ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టటం అవసరమని కొంతమంది ప్రముఖ న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. లోక్‌పాల్ చట్టంలో వివాదాస్పద వివరాలను ఖరారు చేయటం, వాటిపై ఒక ఆమోదయోగ్య పరిష్కారానికి ప్రయత్నిస్తుండటం ఇవన్నీ కూడా చట్టపరంగా తప్పనిసరిగా చేయాల్సిన సంస్థాగత నిర్మాణాన్ని రాజ్యాంగంలో పొందుపరచటానికి ఆటంకాలు కానక్కర్లేదు. "రాష్ట్రాల హక్కుల" అంశం కూడా దీనివల్ల పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుంది. ఇటీవల సభలో విఫలమైన రాజ్యాంగ సవరణ బిల్లు... లోక్‌పాల్/లోకాయుక్తలకు రాజ్యాంగప్రతిపత్తిని ప్రతిపాదించింది. ఇందులో వివాదాస్పద అంశాలేమీ లేవు. కాబట్టి విభేదాలని పక్కనపెట్టి దాన్ని ఆమోదించటం సాధ్యమవుతుంది. సుహృద్భావం, పరస్పర విశ్వాసం, అవినీతిని నియంత్రించాలనే నిజమైన సంకల్పం ఉంటే... ఒక ఆమోదయోగ్యమైన చట్టాన్ని త్వరితగతిన చేయటం ఏరకంగానూ కష్టం కాదు.

ఇప్పటికైనా సమయం మించిపోలేదు. గత ఏడాది మనకు అనేక విలువైన పాఠాల్ని నేర్పింది. కొత్త సంవత్సరంలో ఆ పాఠాల్ని మనం ఆచరణలో అమలు చేయాలి. దేశవ్యాప్తంగా ప్రభావవంతమైన, స్వతంత్రమైన, అవినీతి వ్యతిరేక వ్యవస్థని, సంస్థల్ని ఏర్పాటు చేసుకునేందుకు విజ్ఞతతో, సమిష్టితత్వంతో వ్యవహరించాలి. గత ఏడాది చవిచూసిన విద్వేషం, అపనమ్మకం, విరోధ భావం స్థానంలో సామరస్యత, సంకల్పం, పరస్పర గౌరవం భావాలను పెంపొందించుకోవాలి. మన జాతి గౌరవం, ఆత్మవిశ్వాసం, పాలనాప్రక్రియ పట్ల ప్రజలలో నమ్మకం, ప్రపంచంలో భారత్ ప్రతిష్ఠ, మనదేశం పట్ల పెట్టుబడిదారులకు విశ్వాసం... ఇవన్నీ ఈవేళ ప్రమాదంలో పడ్డాయి. విభేదాలను విస్మరించి, అందరం కలిసి నిర్ణయాత్మకంగా, వేగంగా వ్యవహరించాల్సిన సమయమిది. ■

# లోక్‌పాల్ బిల్లు - ఓడింది ప్రజలే

- శిరమణి నరేష్

- అన్నా ప్రతిపాదనలపై అన్ని పార్టీలదీ ఒకే వైఖరి
- బీజేపీ మద్దతు లేకుండా బిల్లుకోసం ప్రయత్నం
- లోక్‌పాల్ ఏర్పాటు ఘనత కోసం తాపత్రయం
- లోకాయుక్తల సాకుతో బీజేపీ ఆటంకం
- ఐక్యపోరాటానికి అవరోధంగా అన్నా బృంద సభ్యులు
- రాజకీయ వైఖరితో ఉద్యమానికి దెబ్బ
- ప్రజలకు మిగిలింది ప్రేక్షక పాత్రే!

డిసెంబర్ 29న మన ప్రజాస్వామ్యానికి చీకటి రోజు. పెద్దల సభ సుదీర్ఘ చర్చలు జరిపి ప్రజల ఆశల్ని ఎగరవేసుకుపోయిన రోజు. లోక్‌పాల్ వ్యవస్థతో దేశంలో అవినీతి మొత్తం అంతం అవుతుందనే ఆశ ఎవరికీ లేకపోయినా, కనీసం కొద్దిగా అయినా తగ్గు తుంది అని మాత్రం చాలా మంది నమ్మారు. లోక్‌పాల్ బిల్లు ఆమో దం పొందక పోవ డానికి ఎవరు కారణం అంటే ప్రభుత్వం, ప్రతి పక్షం, అన్నా బృందం- అందరూ కారణమే.

అన్నా బృందానికి మన్మోహన్ ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రాధాన్యత కన్నా ఎక్కువే ఇచ్చింది. అన్నా బృందాన్ని, కేంద్రమంత్రులను కలిపి ఒక సంయుక్త డ్రాఫ్టింగ్ కమిటీని వేయడం ద్వారా, ప్రభుత్వమే అన్నా బృందాన్ని దేశంలోని పౌరసమాజం మొత్తానికి ప్రతినిధులుగా అంగీకరించి నట్లయింది. అ తర్వాత అన్నా హజారేను అరెస్ట్ చేయడం ద్వారా దేశం మొత్తం అన్నా హజారేకు మద్దతుగా నిలిచేలా చేసింది కేంద్ర ప్రభుత్వమే. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ చేసిన పొరపాట్లు కాగా చివరకు లోక్‌పాల్ బిల్లు రూపొందించడంలో కాంగ్రెస్ తన సొంత వైఖరిని తీసుకుంది. సిబిఐకి స్వయంప్రతిపత్తి, ఎంపీలపై చర్యలు వంటి విషయాలలో పార్టీలన్నింటిది దాదాపు ఒకే వైఖరి. పైకి ఎన్ని నీతులు చెప్పినా పార్టీల మనసుల్లో ఏముందో అందరికీ తెలుసు. అన్నా బృందం, ఇతర పౌరసమాజ సంస్థల సూచనలు, స్టాండింగ్ కమిటీలో ఇతర పార్టీల అభిప్రాయాలు – అన్ని కలగలిపి అంతగా బలం లేని, అంతగా బలహీనం కాని ఓ బిల్లును కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఇక్కడే కేంద్రం లోని కాంగ్రెస్ కురువృద్ధులు తమ రాజకీయాన్ని ప్రదర్శించారు. లోక్‌పాల్‌కు రాజ్యాంగ హోదా కల్పించాలని ప్రతిపాదిస్తూనే లోక్‌పాల్ కమిటీ లో బలహీనవర్గాలతోపాటు మైనారిటీ లకు ప్రాతినిధ్యం అనే అంశాన్ని చొప్పిం చారు. మైనారిటీల పదానికి భారతీయ జనతా పార్టీ అంగీకరించదు కనుక బిల్లుకు మద్దతు ఇవ్వదు. బిజేపి మద్దతు లేకుండా బిల్లు ఆమోదింపజేసి లోక్‌పాల్ ఏర్పాటు చేసిన ఘనతను తాను మాత్రమే సొంతం చేసుకోవడం కాంగ్రెస్ అభిమతం.

బిజెపి, ఇతర రాజకీయ పక్షాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడానికి శాయశక్తులా ప్రయత్నించాయి. నిజానికి ప్రభుత్వ







లోక్‌పాల్ బిల్లులో బిజెపికి ఉన్న ప్రధాన అభ్యంతరం మైనారిటీ అన్న పదం ఈ ఒక్క అంశాన్ని వ్యతిరేకిస్తే తమకు శివసేన తప్ప మిగతా పార్టీల నుంచి మద్దతు వచ్చే అవకాశం లేదు. బిల్లు ఆమోదం పొందితే దాన్ని వ్యతిరేకించిన అపఖ్యాతి తమకి, లోక్‌పాల్‌ను సాధించిన ఖ్యాతి కాంగ్రెస్‌కు వస్తాయని తెలుసు. అయితే రాష్ట్రాలకు ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో కాంగ్రెస్ లాభపడే అవకాశం ఎలా ఇవ్వాలి? అందుకే కమలనాథులు చాలా తెలివిగా లోకాయుక్త ఏర్పాటు అంశాన్ని తెరపైకి తెచ్చారు. లోకాయుక్తల ఏర్పాటు అనేది ఆగస్టు 27 పార్లమెంట్ ఆమోదించిన ప్రకారం సెన్స్ ఆఫ్‌ది హౌస్ తీర్మానంలో అందరూ అంగీకరించిందే. బిజెపి ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకే లోకాయుక్త అంశాన్ని రాష్ట్రాల

అధికారాల్లోకి కేంద్ర చొరబాటుగా చూపించి విజయం సాధించింది. దీని ద్వారా లోక్‌పాల్ బిల్లును ఆమోదింపచేసి లబ్ధి పొందాలనుకున్న కాంగ్రెస్ ఆశలకు బిజెపి గండికొట్టింది.

అన్నా బృందం లోక్‌పాల్‌కు జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మార్చడం, ప్రభుత్వం మెడలు వంచి ఓ చట్టాన్ని పార్లమెంట్ దాకా తీసుకురావడంలో అన్నా బృందం పోషించిన పాత్ర అద్వితీయం, అభినందనీయం. అయితే అన్నా బృందంలోని ఇద్దరి కారణంగా జాతీయ స్థాయిలో ఓ ఉప్పెనలా రావలసిన ఉద్యమం కెరటంలా మాత్రమే మిగిలిపోయింది.

అరవింద్ కేజ్రీవాల్ కిరణ్‌బేడిల వైఖరి కారణంగా, దేశంలో పాలనా సంస్కరణలు కోసం కృషి చేస్తున్న ఏ ఒక్క సంస్థ కూడా అన్నా బృందంతో కలిసి పనిచేయలేకపోయింది. ఇండియా ఎగెనెస్ట్ కరప్షన్ ఉద్యమంలో బాబారాందేవ్, రవిశంకర్ గురూజీ తప్ప పట్టుమని పదిమందిని సమీకరించగలిగిన ఏ ఒక్క సంస్థ భాగం కాలేకపోయాయి. మేధాపాట్కర్ వంటి యోధురాలు ఉన్నా, ఆవిడ పాలనా సంస్కరణల కోసం పట్టిన మధ్యతరగతిని ప్రభావితం చేయగలిగిన వ్యక్తి కాదు. ఫలితంగా ఆదర్శం, ఆవేశం తప్ప వివేచన, పాలనా వ్యవస్థ సంక్లిష్టతను అర్థం చేసుకోవడం, రాజకీయ నాయకులతో వ్యవహరించే నైపుణ్యాలు ఈ బృందానికి లేకుండాపోయాయి.

ఆగస్టు 27 పార్లమెంట్‌లో తీర్మానం చేసిన తరువాత, శీతాకాల సమావేశాల్లో బిల్లు తెస్తామని చెప్పిన తరువాత, కనీసం నాలుగు నెలలు కూడా సమయం ఇవ్వకుండా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉప ఎన్నికల్లో ప్రచారం చేసి అన్నా బృందం ఘోరమైన తప్పిదం చేసింది. అరవింద్ కేజ్రీవాల్ సొంత నియోజక వర్గం కావడం వల్లే హిస్సార్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన అన్నా బృందం పట్ల గౌరవం తగ్గేలా చేసింది. అన్నా బృందంలోని మరో ప్రముఖ వ్యక్తి జస్టిస్ సంతోష్ హెగ్డే కూడా అరవింద్, బేడీలకు భిన్నంగా ప్రకటనలు ఇస్తున్నారు.

మీడియా, నగరాలు, పట్టణాల్లోని యువతరం, మధ్యతరగతి– తమ భుజాలపైకి ఎత్తుకుని అన్నా బృందాన్ని ఓ పెద్ద శక్తిగా మార్చారు. ఈ శక్తిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియక, తెలిసిన వారు చెబితే వినే సహనం లేక తామే పెంచిన లోక్‌పాల్ ఆశా వృక్షం తమ కళ్ల ఎదుటే కూలిపోవడానికి కారణమయ్యారు.

మొత్తంగా 2011లో ఏడాది మొత్తం చర్చనీయాంశంగా నిలిచిన లోక్‌పాల్ చివరకు ఉసూరుమనడానికి కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు, అన్నా బృందం అందరూ కారణమే. చివరకు ఓడిపోయింది ప్రజలే! ■

# గృహహింస చట్టం... అంతంత మాత్రం

## ■ వేలల్లో పెండింగ్ కేసులు

అతివలపై వేధింపులను అడ్డుకుని... వారికి ఆసరాగా నిలిచేందుకు రూపొందించిన గృహహింస నిరోధక చట్టం రాన్రానూ నిష్ఫలంగా మిగిలిపోతోంది. డొమెస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్టు (డీఐఆర్) నమోదు మొదలు తీర్పు ఇవ్వడం వరకూ ఏదీ సకాలంలో జరగడం లేదు. దీంతో, ఎంతో ఆర్భాటంగా రూపొందించిన ఈ చట్టం నామమాత్రంగా తయారైంది. గత ఏడాది మొదటి పదినెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ చట్టం కింద 15,736 ఫిర్యాదులు అందగా వాటిలో 5910 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. డీఐఆర్ నమోదు చేసిన 60 రోజుల్లో తుది తీర్పు వెలువరించాల్సి ఉన్నప్పటికీ వ్యవస్థీకృత లోపాల కారణంగా... ఎన్నో కేసులు పెండింగ్‌లోనే ఉండటం శోచనీయం.

గృహహింస చట్టం కింద ప్రధానంగా ఫిర్యాదు స్వీకరించే అధికారం జిల్లాస్థాయి స్త్రీ శిశు సంక్షేమ అధికారి, ఆర్డీవోకు మాత్రమే ఇచ్చారు. ఒక వేళ కేసు నమోదు చేసిన సమన్లు ఇవ్వాల్సింది. చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిందీ పోలీసులే. కాని పోలీసుల నుంచి అందుతున్న సహకారం అంతం మాత్రం కావడంతో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ■

| గత ఏడాది మొదటి 10 నెలల్లో.... | |
|---|---|
| గృహహింసకు సంబంధించి అందిన ఫిర్యాదులు | 15736 |
| పరస్పరాంగీకారంతో రాజీ కుదుర్చుకున్నవి | 3642 |
| డీఐఆర్ నమోదు చేసినవి | 8851 |
| తుది ఉత్తర్వులు ఇచ్చినవి | 2174 |
| న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నవి | 5910 |

# అన్నా... మీడియా

- రాజ్‌దీప్ సర్దేశాయ్

***అన్నా ఉద్యమానికి లభించిన ఆవేశపూరిత ప్రచారమే తమ ప్రధాన ఆయుధంగా టీమ్ అన్నా భావించింది. ప్రజాస్వామిక రాజకీయాలు పదే పదే పునః ప్రసారమయ్యే టెలివిజన్ సీరియల్ కాదని, క్రమరహితమైన సంప్రతింపులు, రాజీ ప్రక్రియ అన్న వాస్తవాన్ని అన్నా బృందం మరచిపోయింది. దృఢ వైఖరి కల నాయకులు ఉద్యమ కోలాహలంలో కొట్టుకుపోరు వివేకవంతమైన పౌర సమాజం టీవీ కెమెరాలకు ఆవల చట్టబద్ధతకు ప్రయత్నిస్తుంది.***

ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం పొందుతోన్న వారు తరచు వాటి ద్వారానే పరిసమాప్తమవుతారు. సీఎన్ఎన్-ఐబిఎన్ 'ఇండియన్ ఆఫ్ ది ఇయర్' (2011) అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అన్నా హజారే తన ఉత్థానానికి ప్రసార మాధ్యమాలే కారణమని నిజాయితీగా అంగీకరించారు. 'మహారాష్ట్రలో ఒక ప్రాంతీయస్థాయి ప్రముఖుడినైన నేను జాతీయ స్థాయిలో విఖ్యాతుడిని కావడానికి ప్రసార మాధ్యమాలే ప్రధాన కారణమని ఆయన అన్నారు. 'మీ కెమెరాలు ఎల్లవేళల నన్ను అనుసరిస్తూ ఉండకపోతే నా గురించి ఎవరికి తెలిసేదని అన్నా వినయంగా ప్రశ్నించారు. మరి అవే ప్రసార మధ్యమాలు, ముంబైలో అన్నా దీక్షకు ప్రజాస్పందన కొరవడిన వైనాన్ని అవి నీతి నిర్మూలనకు ఆయన నిర్వహించిన ఉద్యమం ఎలా కాంగ్రెస్ వ్యతిరేక ఆందోళనగా పరిణమించింది. ప్రభుత్వానికి బెదిరింపులుగా ఆయన నిరసన దీక్షలు ఎలా పరిణమించిందీ ఇత్యాది విషయాలపై విశ్లేషణాత్మకమైన కథనాలను నేడు నివేదిస్తున్నాయి. అన్నా హజారే ఒక 'ఫ్రాంకెన్‌స్టెయిన్ రాక్షసుడ'ని అన్నాను మణిశంకర్ అయ్యర్ ఇటీవల అభివర్ణించారు. పలువురు రాజకీయవేత్తలు అయ్యర్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. అవినీతి నిర్మూలనకు సాహసించిన ఈ యోధుడు వాస్తవానికి ప్రసార మాధ్యమాల సృష్టి అని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా పరిణమించారని వారు విశ్వసిస్తున్నారు. అయితే 'దిగివచ్చిన మహాత్ముడు'గా జన హృదయాలలో అన్నా వెలుగొందడానికి ప్రసార మాధ్యమాలే నిజంగా కారణమా? ఆయన దీక్షలకు వాటి మితిమీరిన ప్రచారమే అందుకు దారితీసిందా?

గత తొమ్మిది నెలలుగా అన్నా హజారే సలహాదారులు ప్రసార మాధ్యమాలను చాలా తెలివిగా ఉపయోగించుకున్నారనడంలో సందేహం లేదు. ఫ్లైమ్ టైమ్ ప్రెస్ మీట్‌లు, టీవీ ఛానెల్స్‌ను దృష్టిలో ఉంచుకొని నిర్వహించిన ప్రదర్శనలు, సామాజిక నెట్ వర్కింగ్ ఉద్యమాలు... తన ఉద్యమ కార్యకలాపాలకు లభించిన సంతృప్తకరమైన మీడియా ప్రచారం నుంచి అన్నా లబ్ది పొందారు. అవును, ఆ ప్రచారంలో కొంత అతిగా ఉంది, అవును, పాత్రికేయులు కొంతమంది అన్నాకు ఎనలేని ప్రోత్సాహం, మద్దతునిచ్చారు. ఇంత మాత్రాన అన్నా కేవలం ఒక మీడియా సంఘటనగా భావించడమంటే వీధులలోని ప్రజల మానసిక స్థితిని తప్పుగా అర్థం చేసుకోవడమే సుమా! అన్నా దీక్షా స్థలిలో టీవి కెమెరాలు ఉండడం వల్లే జనసందోహం అక్కడ గుమిగూడలేదు. అనేకానేక అవినీతి కుంభకోణాలతో నైతికంగా భ్రష్టమైన రాజకీయ నాయకత్వానికి ప్రతివాదనగా కన్పించినందునే అన్నా ను ప్రజలు విశ్వసించారు.

గత ఏప్రిల్‌లో అన్నా మొట్టమొదటిసారి మన జాతీయ రాజధానికి వచ్చారు. జంతర్ మంతర్ వద్ద తొలి నిరసన దీక్షకు ఉపక్రమించే ముందు న్యూఢిల్లీ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆ సమావేశానికి పాత్రికేయులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. వచ్చిన వారు సైతం 'ఎవరీ పెద్ద మనిషి' అన్న ఆసక్తితో వచ్చిన వారే. అప్పటికీ జాతీయ మీడియాకు ఆయన కుతూహలం కల్గించిన వ్యక్తిగానే మిగిలిపోయారు. అన్నా దీక్ష ప్రారంభం కాకముందే లోక్‌పాల్‌పై మంత్రుల బృందం నుంచి శరద్ పవార్ వైదొలిగారు. తద్వారా అవినీతిపరుడైన పవార్ అవినీతి వ్యతిరేక చట్ట నిర్మాణ సంఘంలో సభ్యుడెలా అవుతారన్న అన్నా వాదన సబబైనదేనని రుజువయింది. రెండు రోజుల అనంతరం, పటిష్ట లోక్‌పాల్ బిల్లు ముసాయిదాను రూపొందించేందుకై ఒక సంయుక్త

సంఘాన్ని నియమించనున్నట్టు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో, అన్నా ఉద్యమానికి మరింత ప్రోత్సాహం, మద్దతు లభించాయి. ఆ సంయుక్త సంఘంలో 50-50 నిష్పత్తిలో,అప్పటికే ఒక విశిష్టత సంతరించుకున్న 'టీమ్ అన్నా' ప్రతినిధులు, కేంద్రమంత్రులు ఉంటారని కూడా ప్రభుత్వం ప్రకటించింది.

2011 ఏప్రిల్ 9 వరకు, అవినీతి వ్యతిరేక చట్టంపై జరుగుతోన్న చర్చలో పాల్గొంటున్న వారిలో అన్నా కేవలం ఒకరు మాత్రమే. లోక్‌పాల్ కమిటీలో ఆయన నియమించే సభ్యులతో చర్చలు జరపడానికి ప్రభుత్వం అంగీకరించడంతో, అన్నాకు, టీమ్ అన్నాకు, 'పౌర' సమాజపు ప్రతినిధులుగా అధికారిక గుర్తింపు లభించింది. దీంతో లోక్‌పాల్ చట్టం కోసం చాలా కాలంగా కృషి చేస్తున్న అరుణా రాయ్, జయప్రకాష్ నారాయణ్ (లోక్‌సత్తా) మొదలైన వారి కంటే అన్నాకే ప్రాధాన్యం పెరిగిపోయింది. టీమ్ అన్నా ను పౌర సమాజ ప్రత్యేక ప్రతినిధులుగా గుర్తించమని ప్రభుత్వాన్ని మీడియా అడిగిందా? లేక ఎన్‌జిఓలు వారి సహప్రయాణికులను బుజ్జగించాలనే ప్రభుత్వ ఉద్దేశమే టీమ్ అన్నాకు లభించిన గుర్తింపులో ప్రతిబింబించిందా? ఏమైనా ఈ రాజకీయ పొరపాటుకు లోక్‌పాల్‌పై సంయుక్త సంఘంలో ప్రభుత్వ పక్షాన అందరినీ కాంగ్రెస్ మంత్రులనే నియమించారు. దీంతో ఆ చర్చలు ఒక విశాల సమ్మిళిత ప్రక్రియగా కాక కాంగ్రెస్, టీమ్ అన్నాల మధ్య సంప్రతింపులు మాత్రమే అయ్యాయి.

ఏప్రిల్9న సంభవించింది ఒక పెద్ద తప్పు అయితే, దరిమిలా జూన్ 5న చోటుచేసుకున్నది మరో పెద్ద పొరపాటు, ఢిల్లీ పోలీసులు అర్ధరాత్రి బాబా రామ్‌దేవ్ దీక్షా శిబిరంపై దాడిచేసి ఆయన్ని అరెస్ట్ చేసి తీసుకువెళ్ళారు. నలుగురు సీనియర్ కేంద్రమంత్రులు బాబాకు స్వాగతం చెప్పడానికి స్వయంగా విమానాశ్రమానికి వెళ్ళి 72 గంటలు పూర్తికాక ముందే ఆయన్ని ఇలా అరెస్ట్ చేయడం జరిగింది. తొలుత ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఒక విదేశీ ప్రభుత్వాధినేతలా బాబా రామ్‌దేవ్‌ను గౌరవించి, ఆ తరువాత ఆయన్ని ఒక నేరస్థుడుగా పరిగణించడం కాంగ్రెస్ దివాళాకోరు రాజకీయాలకు ఒక తార్కాణంగా నిలిచిపోయింది. ఈ చర్య మన్మోహన్ ప్రభుత్వ విశ్వసనీయతను మరింతగా దెబ్బతీసింది.

మూడో పొరపాటు (ఇది చాలా తీవ్రమైనది) ఆగస్టు 16న అన్నా హజారేను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయడం. రెండో నిరసన దీక్షకు అన్నా సిద్ధమవుతుండగా ఈ పరిణామం సంభవించింది. తొలుత దీక్షకు కూర్చునేందుకై ఆయనకు ఏ ప్రదేశమూ అందుబాటులో లేకుండా చేశారు. ఆ తరువాత ఆయనకు జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. తద్వారా అవినీతి వ్యతిరేక ఉద్యమయోధుడు స్థాయి నుంచి అమర త్యాగం చేసిన మహాపురుషుడుగా పరిణమించడానికి ప్రభుత్వమే ఆస్కారం కల్పించిది. ఏప్రిల్‌లో అన్నా దీక్ష నిర్వహించినప్పుడు వేదికపై భారతమాత పోస్టర్ ఉన్నది బాబా రామ్‌దేవ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురువు శ్రీశ్రీ రవి శంకర్ మొదలైన వారు దీక్షా స్థలికి తరలి వచ్చి అన్నాకు మద్దతు తెలిపారు. ఆ తరువాత ఆగస్టులో రామ్‌లీలా మైదాన్‌లో దీక్షకు పూనుకున్నప్పుడు వేదికపై భారత మాత పోస్టర్ స్థానంలో మహాత్మాగాంధీ చిత్రపటం ఉన్నది. బాబా రామ్‌దేవ్ ఉనికి లేదు. శ్రీశ్రీ రవిశంకర్ కూడా అక్కడ కన్పించలేదు.

అన్నా అరెస్టుతో వేలాది ప్రజలు వీధుల్లోకి వచ్చి తీవ్ర నిరసన తెలిపారు. అవినీతి వ్యతిరేక లోక్‌పాల్ (నిజానికి దీని గురించి వారికి తెల్సింది చాలా తక్కువ) కోసం కాదు ఈ నిరసన. అంతులేని అవినీతికి పాల్పడుతూ దురహంకారపూరితంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వవ్యవస్థ పట్ల నిరసనగానే ప్రజలు తమకు తాముగా వీధుల్లోకి వచ్చారు. ఆత్మత్యాగి ఆయన 'ఫకీర్' వలే ఆగ్రహపూరిత, అజ్ఞాత భారతీయునికి అన్నా హజారే ఒక రక్షరేకుగా భాసిల్లారు. 'ఐ యామ్ అన్నా' అని రాసి వున్న టోపీలు, టీ షర్ట్‌లతో వీధులోకి వచ్చిన యువ భారతీయులు అన్నా ఉద్యమానికి అద్భుతమైన రీతిలో సంఘీభావం తెలిపారు. రాలేగావ్‌సిద్ధిలో పర్యావరణ పరిరక్షకుడుగా ప్రారంభమైన అన్నా ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ఒక జానపద వీరుడుగా పరిణమించారు. అన్నా నిరసన దీక్షను విరమింపచేసే ఆరాటంతో పార్లమెంటు ఆ ఉద్యమ తీవ్రతను, గుర్తించామని, లోక్‌పాల్‌చట్టాన్ని తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని ఒక తీర్మానం చేయడంతో అన్నా విజయం పరిపూర్ణమయింది. ఇప్పుడు మళ్ళీ ఒక ప్రశ్న అన్నా ను అరెస్ట్ చేసేలా ప్రభుత్వాన్ని మీడియా ప్రోద్భలించిందా? లేక తీవ్ర ఆందోళనకు గురైన ప్రభుత్వం చేపట్టిన అహేతుక చర్యే అన్నా అరెస్ట్?

ప్రభుత్వమూ, టీమ్ అన్నా రెండూ మాధ్యమాన్ని సందేశంగా పొరపడ్డామని చెప్పక తప్పదు. తమ ఉద్యమానికి లభించిన ఆవేశపూరిత ప్రచారమే తమ ప్రధాన ఆయుధంగా టీమ్ అన్నా భావించింది. ప్రజాస్వామిక రాజకీయాలు పదే పదే పునఃప్రసారమయ్యే టెలివిజన్ సీరియల్ కాదని, క్రమరహితమైన సంప్రదింపులు, రాజీప్రక్రియ అన్న వాస్తవాన్ని అన్నా బృందం మరిచిపోయింది. ఇక ప్రభుత్వం, అన్నా ఉద్యమ కోలాహలం మీడియా వాతావరణంలో భాగమని గుర్తించడంలో విఫలమయింది. దేశవ్యాప్తంగా మన మీడియా ప్రపంచంలో 350 ఛానెళ్లు, మరెన్నో వందల ఓబివ్యాన్‌లు ఉన్నాయి. అన్నా ఉద్యమ ఆరాటాలనే కాదు భవిష్యత్తులో ప్రజ్వరిల్లే నిరసన ఉద్యమాలను సైతం ప్రభుత్వానికి విన్పించే ధ్వని విస్తారకం మీడియా. దృఢ వైఖరి కల నాయకులు ఉద్యమ కోలాహలంలో కొట్టుకుపోరు, వివేకవంతమైన పౌర సమాజం టీవీ కెమెరాలకు ఆవల చట్టబద్ధతకు ప్రయత్నిస్తుంది. ■

**సమాజహితం కోరే రాజకీయం కోసం**
**రాష్ట్రంలో అవినీతి రహిత పాలన కోసం**
**మీ సహకారాన్నీ తోడ్పాటునీ అందించండి**

# లోక్‌సత్తా పార్టీకి విరాళాలు ఇవ్వండి

**మీరిచ్చే విరాళాలకు పూర్తిగా ఇన్‌కంటాక్స్ రాయితీ వుంటుంది.**

**ఫిబ్రవరి 11-26**
**లోక్‌సత్తా పార్టీ నిధి సేకరణ పక్షం**

- అవినీతిని అంతం చెయ్యడానికి, రాజకీయాలను క్షాళణ చెయ్యడానికి రూపుదిద్దుకున్న ప్రజాఉద్యమమే లోక్‌సత్తా పార్టీ
- ప్రజలు ప్రభువులు - పాలకులు సేవకులేనన్న నినాదాదన్ని ఇచ్చిన పార్టీ లోక్‌సత్తా పార్టీ

ఇది ప్రజల ఉద్యమం - ప్రజలే దీనిని పెంచి పోషించుకోవాలి.

మీరిచ్చే విరాళం బలప్రదర్శనల కోసం జనాల తరలింపులకీ మద్యం పంపిణీకి ఒక్క రూపాయి కూడా వినియోగంకాదు. మీరిచ్చే విరాళం కార్యకర్తల జేబుల్లోకి, నాయకుల ఎకౌంట్లలోకి ఒక్క రూపాయి కూడా తరలిపోదు.

మీరిచ్చే విరాళం ప్రతి రూపాయి ప్రజాచైతన్య కార్యక్రమాలకే వినియోగం అవుతుంది. మీరిచ్చే విరాళం ధన రాజకీయాన్ని జనరాజకీయం చేసే కార్యకలాపాలకే వెచ్చించబడుతుంది.

మీరిచ్చే విరాళాలకు చిన్న మొత్తాలకి కూపన్లు, పెద్ద మొత్తానికి రశీదులు విధిగా ఇస్తారు. మీరిచ్చే విరాళం ప్రతిరూపాయి విధిగా రాష్ట్రపార్టీ కార్యాలయానికే చేరుతుంది. అక్కడనుండే పార్టీ కార్యకలపాలకు వినియోగం అవుతుంది.

మీరిచ్చే విరాళాలకు ప్రతి ఏటా జమాఖర్చులు ఆడిట్‌చేయించి వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో వుంచుతున్న ఏకైకపార్టీ లోక్‌సత్తా పార్టీ.

మీరిచ్చే విరాళం లోక్‌సత్తా పార్టీని బలోపేతం చేస్తుంది. రాష్ట్ర రాజకీయాన్ని మారుస్తుంది. అవినీతి రహిత పాలనకు ద్వారాలు తెరుస్తుంది.

**ఫిబ్రవరి 11-26 తేదీల మధ్య లోక్‌సత్తా పార్టీ నాయకులు, కార్యకర్తలు మీ సహాయాన్ని అర్థించడానికి వస్తారు. మీశక్తి మేరకు ఇవ్వగలిగినంత హెచ్చు మొత్తాలను విరాళాలుగా ఇవ్వండి లోక్‌సత్తాపార్టీని ఆదరించండి, ఆశీర్వదించండి.**

**లోక్‌సత్తా పార్టీ**

## ఎఫ్‌డిఐల పై రైతులతో చర్చ - క్షేత్రపర్యటన - సర్వేలో అభిప్రాయాలు

# దళారిరాజ్యం పోవాలి

- బండారు రామ్మోహన్‌రావు

*దేశీయ మార్కెట్‌లోకి విదేశీ పెట్టుబడులను రిటైల్ రంగంలో అనుమతించాలా? వద్దా? అనే విషయంలో దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. కేంద్ర కేబినెట్ కూడా విదేశీ పెట్టుబడులను అనుమతించాలని నిర్ణయించింది. కాని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు అభ్యంతరం చెప్పడం వల్ల ఈ బిల్లును పార్లమెంటులో పెట్టకుండా వెనక్కు తగ్గింది. దేశంలో ఈ విషయంలో ఇంకా చర్చ జరగాలని, ఆ తరువాతే ఎఫ్‌డిఐ లపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. నిర్ణయాలను ఎక్కడో ఏ.సి రూముల్లో నలుగురైదుగురు కలిసి తీసుకునే బదులు ఆ నిర్ణయం వల్ల ప్రభావితమయ్యే స్టేక్ హోల్డర్స్‌ని సంప్రదిస్తే వాస్తవాలు తెలుస్తాయి. లోక్‌సత్తా మొదటి నుండి ఇలాంటి అంశాలపై ప్రజావాణిని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది. అంశం ఏదైనా ప్రజాక్షేత్రంలోనే దానికి సరియైన పరిష్కారం లభిస్తుందని నమ్ముతుంది. అందులో భాగంగానే ఎఫ్‌డిఐ లపై లోక్‌సత్తా విధానాన్ని మరింత స్పష్టతతో వెల్లడించడానికి క్షేత్రస్థాయి అనుభవాన్ని సేకరించింది. హైదరాబాద్‌కు 40, 50 కిలోమీటర్ల దూరంలో వున్న రంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతుల్ని పలకరించింది. వారితో చర్చించింది. వారు చెప్పిన విషయాలను యధాతథంగా రికార్డు చేసింది.*

డిశంబరు 22 చలికాలం ఉదయం తొమ్మిదవుతున్నా మంచుతెరలు కమ్ముకునే ఉన్నాయి. ప్రజాస్వామ్యపీఠం (ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్) నుండి సాయికృష్ణ, లోక్‌సత్తా వలంటీర్ బాబు ఆనంద్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా షామీర్‌పేట పంచాయతీ బాబాగూడ గ్రామానికి వెళ్లాము. ఊరు చివర పంచాయతీ ఆఫీసు దగ్గర టీ కొట్టు ముందు పదిమంది రైతులు టీ తాగుతూ కనబడితే అక్కడే ఆగాము. మెల్లగా మమ్మల్ని మేము పరిచయం చేసుకుని రైతుల గురించి, పంటల గురించి మాట్లాడటం మొదలుపెట్టాము. ఆ ఏవుంది సార్! 'అమ్మబోతే అడవి కొనబోతే కొరివి' అన్నాడోరైతు. పంట పండినా నష్టమే, పండకపోయినా నష్టమే వస్తుందని మరో రైతు అన్నాడు. మెల్లగా ఆ చర్చ రైతు చర్చావేదికగా మారింది. వాళ్ళు అక్కడ ఎక్కువగా కూరగాయలు పండిస్తున్నారు. హైదరాబాద్‌కి 30 కి.మీ దూరమే గనుక కూరగాయల సాగు చేస్తున్నారు. అందులో కష్టనష్టాలు ఏకరువు పెట్టారు.

చల్లకొచ్చి ముంత దాచడమెందుకని మెల్లగా మేము వచ్చిన పని చెప్పాము. ఇటీవల కేంద్రప్రభుత్వం ఫారిన్ డైరక్ట్ ఇన్వెస్టిమెంట్స్ (ఎఫ్‌డిఐ)ల మీద ఒక నిర్ణయం తీసుకుందని, ఇది రైతులకు నష్టమో, లాభమో తెలుసుకుందామని వచ్చామని చెప్పాము. ఆ ఇంగ్లీష్ మాటకి మాకు అర్థం తెలియదుకాని అమ్మేవాళ్ళు లక్షలు కొనే వాళ్ళు పదిమందే వుంటే మేం నష్టపోతాం కదా! కొనేవాళ్ళ సంఖ్య పెరిగితే పోటీ పెరిగి మాకు కొంత గిట్టుబాధ ధరైనా వస్తుంది అన్నాడు పట్టాభిరెడ్డి అనే రైతు. ఇంతలో ఆనంద్‌రెడ్డి అనే ఆదర్శరైతు వెంటనే అందుకున్నాడు. పిల్లి నల్లదా ? తెల్లదా? అనే అనుమానం అవసరం లేదు సార్! మాకు ఎవరైతే ఏం కొనేవాళ్ళు కావాలి కదా అన్నారు. తనకి ఎఫ్‌డిఐల గురించి తెలుసని వాటిపై దేశంలో జరుగుతున్న చర్చ చూస్తుంటే ఈ ప్రభుత్వాలు దళారుల కోసం ఉన్నాయా? రైతుల కోసం వున్నాయా అనే అనుమానం



కలుగుతుందని వాపోయారు. ప్రభుత్వం ఎఫ్‌డిఐలపై నిర్ణయాన్ని వాయిదా వేయడాన్ని ఆ రైతు నిరసించాడు.

రైతులతో మాట్లాడేటప్పుడు మనం ఎఫ్‌డిఐలకు అనుకూలమనో, వ్యతిరేకమనో భావన కలగకుండా నిష్పక్షపాతంగా ఒక సర్వే జరపాలని కార్లో వెళుతున్నప్పుడు మేమనుకున్నాం. రైతులతో చర్చలో సరిగ్గా అందరం ఆ సూత్రాన్నే పాటించాం. మెల్లగా రైతులు మాతో మమేకమై మాట్లాడడం మొదలుపెట్టారు. వాళ్ళ కూరగాయల్ని ఎక్కడ అమ్ముకుంటున్నారు? అని ఆరా తీస్తే అక్కడికి దగ్గర్లోని అల్వాల్ రైతు బజార్‌లో అమ్ముకుంటున్నామని వారు చెప్పారు. అక్కడ రైతులకంటే దళారీలే ఎక్కువయ్యారని మెల్లమెల్లగా రైతుల శాతం తగ్గుతూ దళారీలే తిష్టవేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేసారు. ఇటీవలే మేడ్చల్ ఎమ్మెల్యే కె. లక్ష్మారెడ్డి దళారీలను రైతుబజార్లనుంచి బయటకు పంపమని ఆదేశాలు ఇవ్వడం వల్ల కొంత మెరుగైందని వారన్నారు. కాని దళారులు ఇతర రాజకీయ నాయకులతో వత్తిళ్లు తీసుకువచ్చి మళ్ళీ రైతుబజార్లో తిష్టవేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని రైతుల ఆందోళన వ్యక్తం చేసారు. అసలే గిట్టుబాటు కావడం లేదని, రోజంతా రైతు బజార్లో కూర్చొని పావుకిలో మొదలుకొని కిలోవరకు అమ్మితే ప్రతి తూకానికి యాభై వంద గ్రాములు మొగ్గు తూకం వెయ్యాల్సివస్తుందని చెప్పారు.

రైతుబజార్ల రేటు నిర్ణయం ఒకేచోట జరగడం వల్ల ప్రాంతాలవారీ రైతులు నష్టపోతున్నారని వారన్నారు. బోయిన్‌పల్లి రైతుబజార్లో నిర్ణయించిన రేటుకి హైదరాబాద్‌లోని మిగతా ఎనిమిది రైతు బజార్లో కూడా అమ్మాల్సివస్తుందని వారు తెలిపారు. రోజుకో రైతుబజార్ రేట్లను నిర్ణయిస్తున్నా అందులో రైతుల భాగస్వామ్యం అసలే లేదని రైతులు తెలిపారు. గతంలో ధర నిర్ణయ కమిటీలో రైతులను భాగస్వామ్య చేసేవారని ఈమధ్య ఏకపక్షంగా రైతుబజార్ల ఈవోలే ధరల




నిర్ణయం చేస్తున్నారన్నారు. ఏ పంట పండించటానికి ఎంత ఖర్చు అవుతుందో లెక్కవేయకుండా ఇవ్వాల్టి రేటు ఇదని నిర్ణయించడం ఏం న్యాయం అని వారు ప్రశ్నించారు. ఇక సికింద్రాబాద్‌లోని 'మోండామార్కెట్'కో హైదరాబాద్‌లోని 'మీర్‌ఆలంమండి'కో వెళితే కమీషన్ ఏజెంట్ నుండి హమాలీ వరకు దోపిడీ తట్టుకోలేకపోతున్నామని రైతులు అన్నారు. ఇక మిగిలింది పక్కనే మెదక్ జిల్లాలో వున్న వంటిమామిడి మార్కెట్ సబ్‌యార్డు అక్కడికి కూడా కూరగాయలు తీసికెళ్ళి అమ్ముకుంటున్నామని రైతులు తెలిపారు. కాని అక్కడ గిట్టుబాటు ధర రావడం లేదని ఆ రోజు వచ్చిన కూరగాయలను బట్టి ధర నిర్ణయం కావడం వల్ల పండిన పంట అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తుందని వారన్నారు. ం-

అక్కడి నుండి పోతారం అనే గ్రామానికి వెళ్ళాం. మేం వస్తున్నామని అంతకుముందే సమాచారం వుండడం వల్ల



మధ్యాహ్నం అయినా రైతులు మాకోసం ఎదురుచూస్తున్నారు. బుచ్చిరెడ్డి అనే రైతు పొలంలో రైతు చర్చావేదిక మొదలుపెట్టాం. వాళ్ళ కష్టాలు కమామిషు చెప్పడం మొదలుపెట్టారు. అక్కడ కూడా అందరు కూరగాయలు పండిస్తున్నారు. హైదరాబాద్ వెళ్ళకుండా ఏటికి ఎదురీదినట్లు కరీంనగర్ వెళ్ళే రాజీవ్ రోడ్డుపై వున్న వంటిమామిడి (మెదక్‌జిల్లా) గ్రామం లో వున్న దేశీయ రిటైల్ ఔట్‌లెట్లకి కూరగాయలు తీసికెళ్ళి అమ్ముకుంటున్నారు. బాబాగూడ గ్రామ రైతులకంటే వీళ్ళు చాలా అడ్వాన్సుగా వున్నారు. నారుపోయడం నుండి నీరు పెట్టడం దాకా ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తున్నారు. ఆ ఊళ్ళో అందరూ డ్రిప్ ఇరిగేషన్ పద్ధతినే అనుసరిస్తున్నారు. మంచి వంగడాలను తెప్పించి నాణ్యమైన కూరగాయల్ని పండిస్తున్నారు. అందరూ చదువుకున్న రైతులే కనుక ఎఫ్‌డిఐ గురించి వారికి పెద్దగా వివరించనవసరం లేకపోయింది.

ప్రస్తుతం తాము మార్కెట్ చేస్తున్న రిటైల్ ఔట్‌లెట్ల గురించి వారిని అడిగాం. వాటిపట్ల వారు పూర్తి సంతృప్తితో వున్నారు. 'పిల్లి పిల్లల్ని తిప్పినట్టు' పండించిన పంటను మార్కెట్‌లకి, రైతుబజార్లకి తీసికెళ్ళి అమ్మే బాధ తప్పిందని వారన్నారు. వంటిమామిడిలో వున్న ఐ.టి.సి., రిలయన్స్, మోర్, స్పెన్సర్స్, మెట్రో కంపెనీలు తమకు అవసరమయిన కూరగాయల్ని అంతకుముందు రోజే రైతులతో సంప్రదించి తెమ్మంటున్నారని రైతులు తెలిపారు. వారి ఇండెంట్‌ను బట్టి తాము ఆయా కూరగాయల్ని తీసికెళితే వంటిమామిడిలో వున్న మార్కెట్‌యార్డు కంటే కిలోకి ఒక రూపాయి ఎక్కువ ధరకే హోల్‌సేల్‌గా కొంటున్నారని తెలిపారు. టోమెటోలే కావచ్చు, స్వీట్‌కార్న్ కావచ్చు. ఏదైనా నాణ్యమైన సరుకును గ్రేడింగ్ చేసి తీసుకెళు తున్నామని దానికి తగిన ధరను కూడా పొందుతున్నామని రవీందర్ రెడ్డి అనే రైతు తెలిపారు.

గ్రేడింగ్‌లో మిగిలిపోయిన సరుకును స్థానిక కూరగాయల వ్యాపారులకి కొంచెం తక్కువ ధరకి అక్కడే అమ్మేస్తున్నామని వారు చెప్పారు. ఏదేమైనా ఎఫ్‌డిఐ లు వస్తే దేశీయ రిటైల్ రంగ చరిత్రే మారిపోతుందని వారు ఆశపడుతున్నారు. ఇప్పుడున్న ఈ రిటైల్ ఔట్‌లెట్లకు తోడు విదేశీ కంపెనీలు వస్తే ఇంకా డిమాండ్ ఏర్పడి రైతుకి తగిన ధర వచ్చే అవకాశం ఉందని వారన్నారు. రైతుకి వినియోగదారుడికి మధ్య ఐదారు అంచెలని ఈ ఎఫ్‌డిఐలు తొలగిస్తాయని దాంతో రైతుకు ఆదాయం వినియోగదారుడికి తక్కువ ధరకి కూరగాయలు




దొరికే అవకాశం ఉందని ప్రభాకర్ రెడ్డి అనే రైతు తెలిపారు.

ఎఫ్‌డిఐలు వస్తే చిల్లర వ్యాపారులు నష్టపోయి నిరుద్యోగం పెరుగుతుంది కదా! అన్న మా ప్రశ్నకు మీకు స్వయంగా చూపెడదాం పదండి అంటూ వాళ్ళు కూడా మాతో వంటిమామిడి గ్రామానికి వచ్చారు. రాజీవ్ రహదారిపై గత ఐదారేళ్ళుగా నాలుగైదు దేశీయ రిటైల్ రంగ సంస్థలు

## ఆకివీడు కన్నా హైదరాబాదే నయం

సముద్రానికి దగ్గరగా వున్న ఆకివీడులో చేప ధర కంటే హైదరాబాద్‌లో మెట్రో హోల్‌సేల్ షాపుల్లో చేపల ధరలు తక్కువగా వున్నాయని హైదరాబాద్ వచ్చినప్పుడల్లా అక్కడి చేపలు ఇక్కడ కొనుక్కుంటానని ఆకివీడుకు చెందిన రైతు జి. జానకి రామరాజు చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రముఖ హోటళ్ళ వాళ్ళు కూడా మెట్రో షాపులోనే చేపలు కొంటున్నారని ఆయన అన్నారు.

చిల్లర వ్యాపారం చేసే చేపలు అమ్ముకొనేవాళ్ళు కూడా హోల్‌సేల్‌లో మెట్రోలో కొని మార్కెట్‌లో అమ్ముతున్నారని ఆయన అనుభవాన్ని వివరించారు. చేపలు విస్తారంగా దొరికే మా ప్రాంతం నుండే హోల్‌సేల్‌గా కొని మధ్య దళారీలు ఎక్కువమంది లేకుండా చేసే ఇలాంటి హోల్‌సేల్ షాపులు ఇంకా రావాలంటే దేశంలోకి ఎఫ్‌డిఐ పెట్టుబడుల్ని అనుమతించాలిన జానకి రామరాజు గట్టిగా వాదిస్తున్నారు.

కూరగాయల్ని రైతుల నుండి నేరుగా కొంటున్నాయి. అక్కడ అనుభవాల్ని చూస్తే రైతులు కంపెనీలు ఇచ్చిన ఇండెంటును బట్టి మధ్యాహ్నం కల్లా తాజా కూరగాయల్ని అక్కడ అమ్ముకుంటూ వెంటనే డబ్బు ఆన్‌లైన్ అకౌంట్‌లో జమ చేయించుకుంటున్నారు. ఒక్కో షాపులో ఐదునుండి పది పదిహేనుమంది చుట్టుపక్కల గ్రామాల యువతీయువకులు పనిచేస్తున్నారు. రైతులు తెచ్చిన సరుకుల్ని గ్రేడింగ్ చేయడం, లోడింగ్, అన్‌లోడింగ్ చేయడం హైదరాబాద్‌కు పంపడం వరకు వారు చూస్తున్నారు. అందరూ ఇంటర్మీడియట్, పదవ తరగతి లోపే చదువుకున్నారు. ఒక్కొక్కరికి 4 వేల నుండి 6 వేల వరకు జీతాలు ఇస్తున్నారు. ఇట్లాంటి ఔట్‌లెట్లు ఇంకా పెరిగితే ఎక్కువమంది యువతకు అవకాశాలు లభిస్తాయని వారు తెలిపారు.




బోయిన్‌పల్లి రైతు బజార్ ధరల్ని ఎప్పటికప్పుడు సేకరించి దానిప్రకారమే రిటైల్ ఔట్‌లెట్స్ మరో రూపాయో అర్ధరూపాయో పెంచి రైతుల వద్ద కూరగాయలు కొంటున్నారు. ఆ పక్కనే వున్న వంటిమామిడి మార్కెట్ సబ్ యార్డులో గ్రేడింగ్ చేయని కూరగాయల రేటుకి, రిటైల్ ఔట్‌లెట్ల రేట్లకి సగానికి సగం తేడా వుంది. దాంతో రైతులు రిటైల్ ఔట్‌లెట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. రిటైల్ ఔట్‌లెట్ల సేల్స్‌మేనేజర్లను ఇంటర్వ్యూ చేశాం. రైతుల వద్ద కొన్న ధరకి మరో 30% లాభం వేసుకుని రిటైల్ అమ్మకాలను చేస్తున్నామని వారు తెలిపారు. రవాణాలో కూడా ప్రమాణాలు పాటిస్తాం కనుక రిటైల్ ఔట్‌లెట్లలో తాజా సరుకుల్ని అమ్మగలుగుతున్నామని వారు తెలిపారు. రిటైల్ ఔట్‌లెట్లకి సరుకులు తీసుకువచ్చిన రైతులను ఎఫ్‌డిఐ ల గురించి అడిగితే మాకు డిమాండ్ కలిగించే ఏ మార్పునైనా మేము ఆహ్వానిస్తామని అన్నారు. అందుకే వంటిమామిడిలోని రిటైల్ ఔట్‌లెట్లలోనే మా కూరగాయలను అమ్ముకుంటున్నాం అన్నారు. విదేశీ సంస్థలు వస్తే మాకే లాభం కదా! అన్నారు.

ఇక మా సర్వే అల్వాల్ రైతుబజార్ వద్దకు మారింది. రైతు బజార్ బయట ఇటీవలే తొలగించిన దళారి అమ్మకం దారులు గుమిగూడి ఉన్నారు. లోపల ఇంకా కొంతమంది దళారీలు వుండగా మమ్మల్నే ఎందుకు తొలగించారని వారు ప్రశ్నించారు. అసలు రైతులేమో దళారీలను పూర్తిగా తొలగించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. కొందరు మోతుబరి రైతులు మేం పంట పండించాలా, పండించిన పంట రైతు బజార్లో కూర్చుని అమ్మాలా? ఏదేమైనా మధ్య దళారులు వుండాల్సిందే అని మరో వాదన మొదలెట్టారు. రైతుల్లో ఐక్యత లేదని కులాలు, పంటలు రాజకీయ పార్టీలపరంగా చీలిపోవడం వల్ల ఇలాంటి వాదనలన్నీ వస్తున్నాయని రైతుబజారుకు రోజు కూరగాయలు తెచ్చే షామీర్‌పేట రైతు ఆనంద్‌రెడ్డి వాపోయారు. ఏదేమైనా తాము పండించిన పంటకు లాభసాటి ధర వచ్చినప్పుడే రైతులు బాగుపడతారని ఆయన అన్నారు. ■



## స్థానిక రైతులపై

# మల్టీబ్రాండ్ రిటైల్ రంగం ప్రభావం

### - ఒక పరిశీలన

- సాయికృష్ణ తోట

రిటైల్‌రంగ వ్యాపారానికి సంబంధించి మల్టీబ్రాండ్ రిటైల్ సంస్థలు గ్రామాల్లో అనుసరిస్తున్న వ్యవసాయ, మార్కెట్ విధానాల పరిశీలన, అంచనా వేయడం కోసం 2011 డిసెంబర్ 22న మెదక్ జిల్లాలోని షామీర్‌పేట, పోతారం, ఒంటిమామిడి గ్రామాల్లో ఒక క్షేత్ర పర్యటనను నిర్వహించడం జరిగింది. ఈ బృందంలో రైతులు, వారి ప్రతినిధులు, పంపిణీ కేంద్రాల ప్రతినిధులు, వ్యవసాయ కార్మికులు, రైతుబజార్ల నిర్వాహకులు పాల్గొన్నారు. మోర్, స్పెన్సర్స్, రిలయన్స్ ఫ్రెష్, ఐటీసీ చౌపాల్, మెట్రో క్యాష్ & క్యారీ తదితర రిటైల్ సంస్థల ప్రతినిధులు కూడా ఇందులో పాల్గొన్నారు. వ్యవస్థీకృత రిటైల్ రంగం రైతులు, గ్రామాలపై చూపిస్తున్న ప్రభావం గురించి ఈ సర్వేలో విస్తృతంగా చర్చించడం జరిగింది. వివరాలు సమగ్రంగా ఇలా వున్నాయి.

★ రైతులు వ్యవస్థీకృత రిటైలర్లకు తమ ఉత్పత్తుల్ని అమ్మడం ద్వారా లాభపడుతున్నారు. మార్కెట్‌తో పోలిస్తే ధరలు కొంత తక్కువగానే చెల్లిస్తున్నప్పటికీ స్థిరమైన డిమాండ్ వుండడం, ఖచ్చితమైన తూకం వుండడం, రవాణా ఖర్చుల్లేకపోవడంవల్ల రైతులు ప్రయోజనం పొందుతున్నారు. ఉదాహరణకు రిలయన్స్ ఫ్రెష్ రైతులనుంచి టమోటాను ఐదు రూపాయలకు కిలోగ్రామ్ చొప్పున కొనుగోలుచేస్తోంది. కానీ రైతుబజార్ ఇవే టమోటాలకు పదిశాతం అదనంగా కేజీకి ఐదున్నర రూపాయలు చెల్లిస్తోంది. కానీ తూకంలో ఖచ్చితత్వం లేకపోవడం, దీనికితోడు 10 శాతం దాకా దళారీలకు కమీషన్ల రూపంలో ఇవ్వాల్సివస్తుండడంతో ఈ ఇబ్బందులేవీ లేని రిటైల్‌రంగం రైతులకు లాభసాటిగా మారింది.

★ నాణ్యమైన ఉత్పత్తుల్ని మాత్రమే రిటైల్ సంస్థలు కొనుగోలు చేస్తుండగా, మిగిలిన ఉత్పత్తుల్ని రైతులు దాదాపు అవే ధరలకు బయట అమ్ముకోగలుగుతున్నారు. దీనివల్ల రైతులకు నాణ్యమైన ఉత్పత్తుల పండించడంపై అవగాహన పెరిగింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ప్రారంభించి రిటైల్ రంగం కోరుకుంటున్న నాణ్యత స్థాయికి వారు తమ ఉత్పత్తుల్ని తీసుకువెళ్ళగలుగుతున్నారు.

★ రిటైలర్లు తమ అవసరాలకు అనుగుణంగా మాత్రమే కొనుగోళ్ళు జరపడంతోపాటు అమ్మకపు ధరను స్థిరీకరించారని పరిశీలనలో తేలింది. ఫలితంగా రిటైలర్లు అదనపు పెట్టుబడి అవసరం లేకుండానే తమ నాణ్యతాప్రమాణాల స్థాయి ప్రయోజనాలను రైతులనుంచే నేరుగా పొందగలుగుతున్నారు. అలాగే, ఎప్పుడు ఏ ఉత్పత్తిని పండిస్తే ప్రయోజనమో రైతులకు సమాచారమివ్వడం, అవగాహన కల్పించడం వల్ల రైతు నష్టపోయే అవకాశాలు తగ్గిపోయాయి. మరోవైపు రిటైలర్ల మధ్య పోటీ రోజురోజుకూ పెరుగుతుండడంతో రైతులు తమ వ్యవసాయ పద్ధతులను మరింత ఆధునికంగా రూపొందించుకోగలుగుతున్నారు. పాలు, పౌల్ట్రీ ఉత్పత్తుల రంగాల్లో రిటైల్‌రంగం సానుకూల ప్రభావం ఇప్పటికే వెల్లడైంది. ఉదాహరణకు వెంకటేశ్వర హేచరీస్ సంస్థ స్టాక్ పెరుగుదల (కోళ్ళ వయసును, వాటి కొవ్వుపదార్థాల స్థాయిని రోజువారీగా లెక్కగట్టడం), దాణా, ఇతర పశుఆహార సరఫరాల్ని తీర్చడం, తుదిస్థాయి మార్కెటింగ్ అవసరాలను నిర్వహిస్తోంది. ప్రధానంగా స్థలం, నివాసాల్ని ఏర్పాటుచేసి, యంత్ర సామాగ్రి తదితరాలు, కార్మికుల నిర్వహణ (కుటుంబాలు / కాలవ్యవధి కూలీలు), రోజువారీ క్షేత్ర నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. ఫలితంగా రైతుకు ప్రతి కోడికీ నేరుగా అమ్మడం లేదా మాంసం రూపంలో అమ్మడం ద్వారా వచ్చే ఆదాయానికి గ్యారంటీ లభిస్తోంది.

★ సాధారణంగా బోయిన్‌పల్లి మార్కెట్‌లో వున్న ధరల ఆధారంగా మార్కెట్ ధరలను నిర్ణయించడం జరుగుతోంది. రిటైల్ సంస్థలు ఈ ధరలకు పదిశాతం అటూఇటూగా తమ ధరల్ని నిర్ణయిస్తున్నారు. దీంతోపాటు తమకు కావల్సిన ఉత్పత్తుల వివరాల్ని ఒకరోజు ముందుగానే రైతులకు తెలియజేస్తున్నారు. తర్వాతరోజు వుండబోయే డిమాండ్ గురించి ముందురోజే తెలియడంవల్ల రైతులు అందుకు అనుగుణంగా తమ ఉత్పత్తుల్ని సిద్ధం చేసుకోగల వెసులుబాటు ఏర్పడింది.

రైతులకు ఒక పటిష్టమైన సంఘటిత వ్యవస్థను ఏర్పరచి, రిటైల్ సంస్థల అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను కేంద్రీకృతం చేయగలిగితే రైతుల తరపునుంచి సరఫరాలు మరింత మెరుగుపడతాయని మా పరిశీలనలో గమనించడం జరిగింది.

★ ఆయా రిటైల్ సంస్థల మధ్య ధరలు, నాణ్యతాప్రమాణాల్లో వ్యత్యాసాలుండడంవల్ల తరచూ పెద్దస్థాయిలో ఉత్పత్తుల్ని తిరస్కరించడం, వృధా కావడం వంటి ఇబ్బందులెదురవుతున్నాయి. రిటైలర్ల అవసరాలకు అనుగుణంగా రైతులు తమ నాణ్యతా ప్రమాణాల స్థాయిని పెంచుకోవడంపై దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఉదాహరణకు ఐటీసీ చౌపాల్ తమ నాణ్యతా ప్రమాణాల్ని చాలా ఉన్నతస్థాయిలో వుంచుతుంది. అదేస్థాయిలో రిలయన్స్ ఫ్రెష్, మోర్ రిటైలర్లకంటే ఎక్కువ ధరల్ని కూడా రైతులకు చెల్లిస్తోంది. ఒక్కో పంపిణీ కేంద్రానికి ఐదు నుండి పదిమంది రోజువారీ ఉద్యోగులు ఇద్దరు శాశ్వత ఉద్యోగుల్ని నియమించుకుంది. కానీ ఇప్పటివరకైతే ఇది పెద్దస్థాయిలో ఉపాధి కల్పించే విధానంగా కనిపించడంలేదు.

★ రైతులకు చెల్లింపు పద్ధతులు కూడా వేర్వేరుగా వున్నాయని గమనించడం జరిగింది. ఉదాహరణకు ఐటీసీ చౌపాల్ అక్కడికక్కడే చెల్లింపులు జరుపుతోంది. మోర్ సంస్థ వారానికి మూడుసార్లు చెల్లిస్తోంది. ఏ చెల్లింపు పద్ధతితోనైనా రైతులు సంతృప్తిగా వున్నారు.

వ్యవసాయ కార్మికుల లభ్యత తక్కువగా వుందనే భావన సర్వత్రా వుంది. కానీ పెద్దఎత్తున యాంత్రికీకరణ చేపట్టి వాణిజ్య వ్యవసాయాన్ని చేపడితే ఆ పరిస్థితి పూర్తిగా తారుమారయ్యేట్లు కనిపిస్తోంది.

మొత్తమ్మీద చూస్తే, మల్టీబ్రాండ్ రిటైల్ కేంద్రాలు రైతులకు ప్రయోజనకరంగానే కనిపిస్తున్నాయని పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. పెద్దఎత్తున పోటీ వుండబోతుండడంవల్ల కంపెనీలు కూడా రైతులు తమ వ్యవసాయ విధానాల అభివృద్ధి చేసుకోవడానికి ఇవి సాయపడతాయి. ఇది ఖచ్చితంగా వ్యవసాయరంగం, రైతుల అభివృద్ధికి దోహదం చేస్తుంది. ■

# వ్యవసాయంలో ముందున్న ఇతర రాష్ట్రాలు

## ప్రణాళిక సంఘం తాజా విశ్లేషణ

రాష్ట్రంలో వ్యవసాయానికి పెద్దపీట వేశాం... రైతులకు అనేక మేళ్లు చేస్తున్నాం అని నేతలు చెబుతున్న మాటలు అవాస్తవం అని తేలిపోయింది. దేశంలోని అనేక రాష్ట్రాలతో పోల్చితే... అన్నపూర్ణగా పేరు తెచ్చుకున్న మన రాష్ట్రం వ్యవసాయంలో పూర్తిగా వెనకబడిపోయింది. మన రాష్ట్రానికి మిన్నగా ఇతర రాష్ట్రాలు వ్యవసాయ రంగంలో మంచి వృద్ధిని సాధిస్తున్నట్లు ప్రణాళిక సంఘం తాజా విశ్లేషణలో వెల్లడయ్యింది.

వ్యవసాయంలో గత ఏడేళ్ల వృద్ధి రేట్లను పరిశీలిస్తే ఒక్క 2007-08లో తప్ప మిగతా అన్ని సంవత్సరాల్లోను కూడా కొన్ని ప్రధాన రాష్ట్రాలు ఇక్కడి కంటే మెరుగైన ఫలితాలను కనబర్చాయి. ప్రణాళిక సంఘం తాజాగా అన్ని రాష్ట్రాల్లోని వ్యవసాయ వృద్ధి రేట్లను విశ్లేషించింది. వృద్ధిరేటు 2005-06లో రాష్ట్రంలో8.84 శాతం ఉండగా తమిళనాడులో 11.67 శాతం ఉంది. 2006-07లో రాష్ట్రం కేవలం 2.73 శాతంలో సరిపెట్టుకోగా 16 రాష్ట్రాలు ఇంత కంటే మెరుగైన ప్రగతిని కనబర్చాయి. బీహార్‌లో ఏకంగా 29.90 శాతం వృద్ధి నమోదయ్యింది. 2007-08లో ఏపీ 16.86 శాతంతో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ ఆ మరుసటి సంవత్సరానికి మళ్లీ క్షీణించి కేవలం 1.20 శాతంతో సరిపెట్టుకొంది. ఇదే ఏడాది బీహార్‌లో 14.65 శాతం ఉంది. ఇలా 13 రాష్ట్రాలు మన కంటే ముందున్నాయి. 2009-10లో రాష్ట్రంలో మరీ ఘోరంగా 1.1శాతం మాత్రమే వృద్ధి ఉంది. వ్యవసాయం, సేవలు, పరిశ్రమల రంగాల వార్షిక ఆదాయాల మొత్తమే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ). ఇందులో గత ఏడాది ఆదాయానికంటే ఇప్పుడు ఎంత శాతం పెంపు ఉంటుందో దాన్నే వృద్ధి రేటుగా వ్యవహరిస్తారు. ■

### కూరగాయల కొనుగోళ్ళలో రిటైల్ చైన్స్

# వంటి మామిడిలో ఏం జరుగుతోందంటే...

ఒకే రకమైన ఉత్పత్తులు మార్కెటుకు ఎక్కువగా వచ్చినప్పుడు ధర అమాంతం పడిపోతుందేమోనన్న దిగులు అక్కడ లేదు.. వ్యాపారులు – దళారులు కుమ్మక్కు అవుతారన్న ఆందోళన అక్కరలేదు.. ఆరుగాలం రైతు తాను పడ్డ శ్రమను అర్థ రూపాయికో, రూపాయికో అమ్ముకోలేక, రోడ్డుపై పారబోసే దుస్థితీ తలెత్తదు...! ఆ చోట ఏదంటే...

- పల్లె చెంతనే సంస్థల కూరగాయల కొనుగోళ్లు
- మంచి ధరలు - మోసాలకు తావు లేదు!
- రైతులకు కలిసొచ్చిన సేకరణ

ఎగుడుదిగుడులు లేని ధర...నిక్కచ్చిగా చెల్లింపులు అవసరమైతే ఫోన్ చేసి పిలిచి రైతు పంటను కొనే సౌలభ్యం... అన్నిటికీ మించి ఎక్కువగా ఉన్న ఉత్పత్తిని రేపటి కోసం అట్టిపెట్టే అవకాశం. ఇవీ... ఒక చిన్న ఊరిలో పలు సంస్థల సేకరణ కేంద్రాలు కల్పిస్తున్న సౌకర్యాలు.

**ఇంతకూ ఏది ఆ చిన్న ఊరు?**

అది మెదక్ జిల్లా ములుగు మండలంలోని వంటిమామిడి గ్రామం. అక్కడ రిలయన్స్, హెరిటేజ్, మెట్రో, స్పెన్సర్స్, ఐటీసీ, ఫుడ్ వరల్డ్ సంస్థలు కూరగాయల సేకరణ కేంద్రాలను (కలెక్షన్ సెంటర్స్) ఏర్పాటు చేసి, రైతులకు దన్నుగా నిలుస్తున్నాయి. పరిసరాల్లోని వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, గజ్వేల్, సిద్దిపేట, రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట మండల పరిధి గ్రామాలకు చెందిన చిన్న రైతులు, సన్నకారు రైతులు వారి కాయగూరల ఉత్పత్తులను తీసుకు వస్తున్నారు. సౌలభ్యం ఉన్న వారు సొంత వాహనాల్లో తరలిస్తుంటే, మిగిలిన వారు ట్రాలీ ఆటోల్లో తీసుకు వస్తారు.

**అక్కడే ఎందుకు...?**

వంటిమామిడి గ్రామానికి కేవలం 35 కిలోమీటర్ల ఆవల హైదరాబాద్ జంట నగరాలు ఉన్నాయి. రవాణాపరంగా అనువైంది. ఒక్క గజ్వేల్ నియోజకవర్గంలో 5,000 మంది రైతులు 6,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కూరగాయలు పండిస్తున్నారు. ములుగులో తొలుత స్పెన్సర్ సేకరణ కేంద్రాన్ని తెరిచింది. ఇతర సంస్థలూ ఒక దాని వెనుక మరొకటిగా తరలి వచ్చాయి. వీటిలో నగరంలో విస్తృతంగా శాఖలు ఉండీ, నిల్వ సామర్థ్యం ఉన్నవి కొద్దిగా ఎక్కువ మొత్తంలో కొంటున్నాయి.

**ధరపై దిగులు... లేదు**

ధరల పరంగా అనిశ్చితంగా ఉండే దేశవాళీ బజారులా కాకుండా... ధరపై ఒక అంచనా ఉండటంతో సమీకరణ కేంద్రాలు రైతుల ఆదరణ చూరగొన్నాయి. ఎంత లేదన్నా కిలోకు రూపాయి ఎక్కువే ఉంటుంది. సమీకరణ కేంద్రాలకు స్థానిక ప్రాంత యువకులే ఇన్‌ఛార్జిలు. ఏ గ్రామ రైతుల నుంచి ఏ పంట ఏ సమయంలో వస్తుంది. ఎంత వస్తుంది అనే విషయాలపై వీరికి అవగాహన ఉంటుంది. స్థానికంగా కొనుగోలు, ఆయా సంస్థలకు జంటనగరాలలో ఉన్న విక్రయ కేంద్రాలు, గోదాములకు సరఫరాను వీరేచూసుకుంటారు. అవసరాలకు తగ్గట్టు సమన్వయం చేస్తారు. కొన్ని సంస్థలు రైతులకు రోజూ చెల్లిస్తుండగా, మరికొన్ని వారంలో రెండుసార్లు చెల్లింపు చేస్తున్నాయి. కొన్ని సంస్థలు నేరుగా రైతు ఖాతాలోకే జమ వేస్తున్నారు.



### రవాణా ఖర్చు, దళారుల బెడద, తప్పాయ్

గజ్వేల్ ప్రాంత రైతులు నాలుగేళ్ల క్రితం వరకు వంటిమామిడి, సికింద్రాబాద్ మోండా, బోయిన్‌పల్లి బజారులకు కూరగాయలను తరలించేవారు. రవాణా వ్యయం, దళారీ కమీషన్ రూపేణా పంట డబ్బులో కొంత కోల్పోవాల్సివచ్చేది. కొన్ని సార్లు పంట అంతా పారబోసి ఛార్జీలకు, తిరుగుప్రయాణానికి పరిచయస్తుల వద్ద చేబదులు చేసిన ఉదంతాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దళారీకి చెల్లించేది రైతుకే మిగులుతోంది.

### రోజుకు ఎన్ని టన్నులు?

ఏడు సేకరణ కేంద్రాలలో రోజుకు ముప్ఫైరకాల కూరగాయలు 40 టన్నుల వరకు రైతుల నుంచి సేకరిస్తున్నారు. రూ॥2 లక్షలకు మించిన లావాదేవీలు సాగుతున్నాయి. సగటున ఒక్కో కేంద్రం నుంచి 5 టన్నులు వెళ్తున్నాయి. 40 మంది క్రమం తప్పని ఖాతాదారులతో పాటు అప్పుడే పంట తీసిన రైతులు కూడా వస్తుంటారు. విశేషం ఏమిటంటే, ఇక్కడి సేకరణ కేంద్రాల బాధ్యులు... నగరంలో గిరాకీ ఉన్న సరకును సిమ్లా, బెంగళూరు, కోస్తా ప్రాంతాల నుంచి తెప్పించి హైదరాబాద్‌కు పంపవచ్చు. ఈ విధంగా హర్యానా యాపిల్, అమలాపురం కొబ్బరికాయలు, ఢిల్లీ కమలా పండ్లను రప్పిస్తున్నారు.

### సాగుపై సూచనలు

వంటిమామిడిలో కూరగాయ విత్తనోత్పత్తి కేంద్రాన్ని రెండు ఎకరాల్లో ఐటీసీ వృద్ధి చేస్తోంది. మేలైన రకాలను రైతులకు రాయితీపై అందించాలనేది ఉద్దేశం. విత్తనాలను ఐరోపా దేశాలకు ఎగుమతి చేసే ఆలోచన ఉంది. సేకరణ కేంద్రాల బాధ్యులు రైతులతో వ్యక్తిగత సంబంధాలు నెరపుతుంటారు. ఏ కూరగాయల విక్రయాలు ఎక్కువగా ఉంటాయో చూచాయగా సూచిస్తారు. అలా వచ్చిన పంటను కచ్చితంగా కొనుగోలు చేస్తారు. ఉదాహరణకు చెప్పుకోవాలంటే మొక్కజన్న స్వీట్ కార్న్ సాగు, ఎగుమతులు భారీగా ఉంటున్నాయి. దీంతో ఈ పంట సాగును పెద్ద ఎత్తున చేపడుతున్నారు.

### స్థానిక కూలీలకు ఉపాధి

సేకరణ కేంద్రాలకు రైతు తెచ్చిన పంటను గ్రేడింగ్ చేసేందుకు ప్రతి కేంద్రంలో అయిదుగురు పనివారు ఉన్నారు. వీరికి రూ॥4,000 రూ॥5,000 వరకు నెలకు వేతనం చెల్లిస్తున్నారు. వీరంతా స్థానిక చిన్న రైతులు, రైతు కూలీలే కావడం విశేషం. ■

## 10 గ్రాముల బంగారం ధరలు (1925 - 2011)

| Year | Price | Year | Price | Year | Price | Year | Price |
|---|---|---|---|---|---|---|---|
| 1925 | ₹ 18.75 | 1947 | ₹ 88.62 | 1969 | ₹ 176.00 | 1991 | ₹ 3,466.00 |
| 1926 | ₹ 18.43 | 1948 | ₹ 95.87 | 1970 | ₹ 184.50 | 1992 | ₹ 4,334.00 |
| 1927 | ₹ 18.37 | 1949 | ₹ 94.17 | 1971 | ₹ 193.00 | 1993 | ₹ 4,140.00 |
| 1928 | ₹ 18.37 | 1950 | ₹ 99.18 | 1972 | ₹ 202.00 | 1994 | ₹ 4,598.00 |
| 1929 | ₹ 18.43 | 1951 | ₹ 98.05 | 1973 | ₹ 278.50 | 1995 | ₹ 4,680.00 |
| 1930 | ₹ 18.05 | 1952 | ₹ 76.81 | 1974 | ₹ 506.00 | 1996 | ₹ 5,160.00 |
| 1931 | ₹ 18.18 | 1953 | ₹ 73.06 | 1975 | ₹ 540.00 | 1997 | ₹ 4,725.00 |
| 1932 | ₹ 23.06 | 1954 | ₹ 77.75 | 1976 | ₹ 432.00 | 1998 | ₹ 4,045.00 |
| 1933 | ₹ 24.05 | 1955 | ₹ 79.18 | 1977 | ₹ 486.00 | 1999 | ₹ 4,234.00 |
| 1934 | ₹ 28.81 | 1956 | ₹ 90.81 | 1978 | ₹ 685.00 | 2000 | ₹ 4,400.00 |
| 1935 | ₹ 30.81 | 1957 | ₹ 90.62 | 1979 | ₹ 937.00 | 2001 | ₹ 4,300.00 |
| 1936 | ₹ 29.81 | 1958 | ₹ 95.38 | 1980 | ₹ 1,330.00 | 2002 | ₹ 4,990.00 |
| 1937 | ₹ 30.18 | 1959 | ₹ 102.56 | 1981 | ₹ 1,800.00 | 2003 | ₹ 5,600.00 |
| 1938 | ₹ 29.93 | 1960 | ₹ 111.87 | 1982 | ₹ 1,645.00 | 2004 | ₹ 5,850.00 |
| 1939 | ₹ 31.74 | 1961 | ₹ 119.35 | 1983 | ₹ 1,800.00 | 2005 | ₹ 7,000.00 |
| 1940 | ₹ 36.04 | 1962 | ₹ 119.75 | 1984 | ₹ 1,970.00 | 2006 | ₹ 8,400.00 |
| 1941 | ₹ 37.43 | 1963 | ₹ 97.00 | 1985 | ₹ 2,130.00 | 2007 | ₹ 10,800.00 |
| 1942 | ₹ 44.05 | 1964 | ₹ 63.25 | 1986 | ₹ 2,140.00 | 2008 | ₹ 12,500.00 |
| 1943 | ₹ 51.05 | 1965 | ₹ 71.75 | 1987 | ₹ 2,570.00 | 2009 | ₹ 14,500.00 |
| 1944 | ₹ 52.93 | 1966 | ₹ 83.75 | 1988 | ₹ 3,130.00 | 2010 | ₹ 18,500.00 |
| 1945 | ₹ 62.00 | 1967 | ₹ 102.50 | 1989 | ₹ 3,140.00 | 2011 | ₹ 26,400.00 |
| 1946 | ₹ 83.87 | 1968 | ₹ 162.00 | 1990 | ₹ 3,200.00 | | |

# ఈశాన్యాన మెరిసే 'మాణిక్యం'

## దేశంలోనే పేద ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్

ఒకప్పుడు బల్లకింద చెయ్యి! తర్వాత... కవర్‌లోకి చేరిన ముడుపుల మూట! ఇప్పుడు... అంతా పబ్లిక్! ఇది డార్విన్ ఊహించని అవినీతి పరిణామక్రమం. నీకింత... నాకు ఎంత? సిగ్గులేకుండా అడిగేయడమే!

ఇందు గలదు... అందు లేదు... ఎందెందు వెదకి చూసిన అవినీతి రక్కసి విశ్వరూప సందర్శనమే! వ్యవస్థ సమస్తం ఇంతనా! బంటు నుంచి రాజు దాకా అక్రమార్కులేనా? కంచుకాగడా పెట్టి వెతికినా ఒక్క నీతిపరుడు దొరకడా? వద్దు... ఈ నిరాశ వద్దు! చీకటి నిండిన లోకం లోనూ కొన్ని వెలుగు కిరణాలు ప్రసరిస్తున్నాయి. అవినీతివనంలో తులసి మొక్కలు ఇప్పటికీ అక్కడక్కడా కనిపిస్తున్నాయి. వారి వ్యక్తిత్వ సమగ్రతకు జోహార్లు. వారి నిజాయితీకి అక్షరాభివందనాలు



- అత్యున్నత హోదాలో అతి సాధారణ జీవితం
- జీతం పార్టీకి విరాళం... భార్య జీతంతోనే జీవితం
- నిజాయితీకి నిలువుటద్దం... రాజకీయ నేతలకు ఆదర్శం

వరుసగా మూడోసారి ఓ రాష్ట్రానికి సారథ్యం వహిస్తున్నా సొంత ఇల్లు లేదు. వాహనం కూడా లేదు. భూములు అంతకన్నా లేవు. బహుశా ఆయనే దేశంలో కెల్లా పేద ముఖ్యమంత్రి! ఆయనే త్రిపుర సీఎం మాణిక్ సర్కార్.

## ఎన్నికల ఆఫిడవిట్‌తో వెలుగులోకి....

సీఎం హోదాలో ఉన్న వ్యక్తి బ్యాంకుఖాతాలో ఎంత ఉండొచ్చు? మాణిక్ సర్కార్ ఖాతాచూస్తే ఆశ్చర్యపోక తప్పదు! బ్యాంకులో ఆయన పేరున ఉన్నది కేవలం రూ॥13.920. రాష్ట్రంలో 2008 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాణిక్ సర్కార్ సమర్పించిన ఆఫిడవిట్‌తో ఇది వెలుగులోకి వచ్చింది. అప్పటికే ఆయన రెండోసారి సీఎంగా వామపక్ష ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్నారు! "సీఎంగా ఆయనకు నెలకు రూ॥9.200 వేతనం వస్తోంది. అలవెన్స్ కింద మరో 1200 అందుతాయి. ఈమొత్తాన్ని ఆయన పార్టీ ఫండ్ కింద విరాళంగా ఇస్తారు." అని సీపీఎం అధికార ప్రతినిధి గౌతందాస్ ఓ సందర్భంలో వెల్లడించారు. మరి వచ్చే జీతం అంతా పార్టీకే ఇస్తే ఎలా అనుకుంటున్నారా? 'నాభార్య పాంచాలి భట్టాచార్జీపై నేను అధారపడతాను. ఆమె కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని' అని మాణిక్ సర్కార్ తెలిపారు. సీపీఎంపై నిప్పులు చెరిగే విపక్షాలు కూడా మాణిక్ సర్కార్ నిజాయితీని శంకించరు. ఆయన ఆదర్శ జీవితాన్ని మెచ్చుకోకుండా ఉండరు.

## నిరాడంబరానికి ప్రతీక

సీఎంగా మాణిక్ సర్కార్ ఎంత నిజాయితీగా పని చేస్తారో... వ్యక్తిగత జీవితంలోనూ అలాగే వ్యవహరిస్తారు. ఈ విషయంలో ఆయన భార్య పాంచాలి కూడా తీసిపోరు. ఇద్దరూ ఒకే కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉన్నా సీఎం తన అధికారిక వాహనంలో వెళితే... ఆమె రిక్షా లేదా ఆటోలో వెళతారు. త్రిపుర ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత నృపేన్ చక్రవర్తికి ప్రియశిష్యునిగా రాజకీయాల్లో రాణించిన మాణిక్ సర్కార్ రాష్ట్రంలో వరుసగా మూడోసారి అధికారాన్ని చేపట్టి చరిత్ర సృష్టించారు. అత్యున్నత వ్యక్తిత్వమే ఆయనకు కొండంత అండ. అందుకే ఎలాంటి ఆరోపణలూ ఆయన దరిచేరవు.

## నేపథ్యం

1949, జనవరి 22న దక్షిణ త్రిపురలోని రాధాకిశోర్‌పూర్‌లో ఓ దిగువ మధ్యతరగతి కుటుంబంలో మాణికసర్కార్ జన్మించారు. విద్యార్థిదశలోనే ఆయన ఉద్యమాల్లో పాల్గన్నారు. 1967 హరిత విప్లవం సమయంలోనే త్రిపురలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తూ సీపీఎంలో చేరారు. తక్కువ కాలంలోనే ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారు. 1972లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యారు. తర్వాత పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా క్రియాశీలక పాత్ర పోషించిన మాణిక్ సర్కార్... 1980లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. అగర్తలా నుంచి ఎన్నికై పార్టీ చీఫ్‌విప్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1993లో రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ రాష్ట్రశాఖ కార్యదర్శిగా, లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్‌గా పని చేశారు. 1998లో ఆయనకు తొలిసారి సీఎం పీఠం దక్కింది. ఇక వెనుదిరిగి చూడలేదు.

నీతిగా బతికి చూపించి ప్రజల గుండెల్లో నిలిచిపోయే మాణిక్ సర్కార్ వంటి ఆదర్శవంతులు సమాజానికి స్ఫూర్తి. ■

# లక్ష్యం చేరని మాతాశిశు సంరక్షణ

- స్వల్పంగా తగ్గిన శిశు మరణాలు
- మాతృమరణాలు మాత్రం యథాతథం
- తక్షణ చర్యలకు కేంద్రం ఆదేశం

వైద్యరంగంలో అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నా. రాష్ట్రంలో మాతాశిశు మరణాల రేటు లక్ష్యాలకు అనుగుణంగా తగ్గటం లేదు. మతాశిశు సంరక్షణకు ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనబడటం లేదు. 2012 నాటికి శిశుమరణాల రేటు 30కి, మాతృమరణాలు 100కు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం లక్ష్యంగా పెట్టుకుంది. శిశుమరణాల విషయంలో 2011లో కొంత పురోగతి సాధించినప్పటికీ మాతృమరణాల్లో ఇంకా లక్ష్యానికి బారెడు దూరంలోనే ఉంది. తాజాగా కేంద్రం విడుదల చేసిన మతాశిశు మరణాల నివేదిక ప్రకారం.. ప్రతి లక్ష మంది గర్భిణుల్లో 134 మంది, జనన సమయంలో ప్రతి 1000 మంది శిశువులకు 46 మంది మృత్యువాతపడుతుండటం గమనార్హం. మతాశిశు సంరక్షణ కార్యక్రమాల తీరుపై గురువారం ఢిల్లీలో జరిగిన జాతీయ సమావేశంలో దీనిపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిసింది. మతాశిశు మరణాలను తగ్గించటంలో గల లోపాలను సవరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు అధికారవర్గాల సమాచారం.

**తగ్గిన శిశుమరణాల రేటు :** 2011 జనవరిలో ప్రతి 1000 మంది శిశు జననాల్లో 49కు తగ్గాయి. 2011లో మొత్తం 69 వేల శిశుమరణాలు నమోదై ఉండొచ్చని వైద్యఆరోగ్యశాఖ అంచనా. గ్రామీణ ప్రాంతాల్లో ఇంట్లోనే కాన్పులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వంటివి శిశు మరణాలు ఆశించిన మేరకు తగ్గకపోవడానికి కారణమవుతున్నాయని భావిస్తున్నారు. గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం కూడా బిడ్డ ఎదుగులపై ప్రభావం చూపుతోంది. వీటి కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రతి 1000 మంది శిశువుల్లో 54 మంది మృత్యువాత పడుతున్నారు. గ్రామాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండడం వల్ల మరణాల రేటు 33కు తగ్గటం విశేషం.

**దక్షిణాదిలో శిశుమరణాల తీరు**

| రాష్ట్రం | జనవరి 2011 | డిసెంబరు 2011 |
|---|---|---|
| కేరళ | 12 | 13 |
| తమిళనాడు | 28 | 24 |
| కర్ణాటక | 41 | 38 |
| ఆంధ్రప్రదేశ్ | 49 | 46 |

**అధికంగా శిశుమరణాలు నమోదవుతున్న రాష్ట్రాలు :** మధ్యప్రదేశ్-62, ఒడిశా-61, ఉత్తరప్రదేశ్-61, అస్సాం-58, రాజస్థాన్-55.

**తగ్గని మతృమరణాలు :** ఇక మాతృమరణాల విషయంలో మాత్రం ఆశాజనక ఫలితాలు కనబడటం లేదు. ప్రతి లక్ష మంది గర్భవతుల్లో 134 మంది మృత్యువాత పడుతూనే ఉన్నారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం కింత మాతాశిశు ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించినా... క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. ప్రతి 100 మంది గర్భవతుల్లో 59 మంది రక్తలేమితో బాధపడుతున్నారు. ఏటా దాదాపు 2300 మాతృమరణాలు కాన్పు సమయంలోనే జరుగుతున్నాయి. రక్షిత విధానాలు పాటిస్తే వీటిని చాలా వరకు నివారించవచ్చు. ■



మన్యంలో పోషకాహార లోపంతో అల్లాడుతున్న చిన్నారుల పరిస్థితికి దర్పణం ఇది. విశాఖపట్నం జిల్లా అనంతగిరి మండలం టంగెలబందకు చెందిన పాండవుల దాసన్న, పుల్లమ్మ దంపతుల కుమారుడు పోషకాహార లోపంతో ఇలా బక్కచిక్కాడు. అవినీతిలో మునిగిపోయిన అంగన్వాడీల వల్లఇలాంటి వారి పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు.
– న్యూస్‌టుడే, దేవరాపల్లి

# ఆదర్శ గురువు శ్రీ నారాయణ గురు

- ఈద చెన్నయ్య

79వ శివగిరి తీర్థాటన మహోత్సవం మరియు చదువుల తల్లి శారదా దేవీ విగ్రహాన్ని ప్రతిష్టించి వంద సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం జిల్లా, వర్కల, శివగిరి మఠంలో డిశంబరు 30, 31 మరియు జనవరి ఒకటవ తేదీ వరకు శ్రీ నారాయణ గురు ధర్మ సంఘం ట్రస్టు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ధర్మసంఘం, శివగిరి ఇంగ్లీషు పత్రిక ప్రధాన సంపాదకురాలు శ్రీమతి సత్యభాయి శివదాన్ ఆహ్వానం మేరకు శ్రీ జయప్రకాష్ నారాయణ ఎమ్మెల్యే, లోక్‌సత్తా పార్టీ అధినేతను అతిధిగా ఆహ్వానించినప్పటికీ సమయాభావం వలన వారు హాజరు కాలేకపోయారు. అనుబంధ విభాగం సర్వజనసత్తా రాష్ట్ర అధ్యక్షులు ఈద చెన్నయ్య, కోశాధికారి వి. హనుమంతరావు పార్టీ ప్రతినిధులుగా హాజరు కావడం జరిగింది. మూడురోజుల పాటు జరిగిన మహా సభలకు శ్రీ నారాయణ గురు అనుచరులు, భక్తులు 25 లక్షల మంది హాజరై సమాధిని దర్శించుకున్నారు. దేశ విదేశాల నుండి విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు అతిధులుగా పాల్గొని, విద్య, విజ్ఞానం పరిశ్రమ, ఆరోగ్యం, వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక, యువజన, మహిళా రంగాలపై ప్రసంగించారు. ఇక్కడ ఇతర మతాలకు చెందిన దేవాలయాల తరహా హంగు, ఆర్భాటాలు లేవు. మహిమలు, అద్భుతాలు వంటి మూఢ నమ్మకాలకు అతీతంగా కేవలం శ్రీ నారాయణ గురు బోధించిన సిద్ధాంతము, బోధనలను మాత్రమే కేరళ రాష్ట్రంలో 40 శాతం ప్రజల జీవన స్థితిగతులను మార్చివేసింది. అదే వారి విశ్వాసానికి నిలయంగా శ్రీ నారాయణ గురు సమాధి, ఆయన ప్రతిష్టించిన శారదాదేవి విగ్రహం మాత్రమే సజీవ సాక్ష్యంగా నిలిచాయి.



ఒక సాధారణ కుటుంబంలో పుట్టిన శ్రీ గురు సుమారు 150 సం॥ క్రిందటే విద్యావంతులు, తండ్రి ఒక ఆయుర్వేద డాక్టరు. భారతదేశంలో కులవ్యవస్థ కారణంగా అధిక సంఖ్యాకులను తరతరాలుగా సమాజంలో అందరితో సమానంగా అవకాశాలను, సహజీవనాన్ని నిరాకరించి బానిసలుగా చేసింది. జీవించే హక్కును హరించింది. దీనిని మతం స్థిరీకరించిందని భావించిన నారాయణ గురు హిందూ మతంలో సంస్కరణలకు పూనుకున్నారు. సృష్టిలోని సంపద, సహజ వనరులు, విద్యా, విజ్ఞానం మానవులందరికి సమానంగా చెందాలంటే విద్య ఒక్కటే పరిష్కారం అని విశ్వసించారు.

మతం కోసం మనిషి కాదు, మనిషి కోసం మతం ఉండాలని బోధించారు. మానవ జాతికి ఒకే కులం, మతం, దేవుడు అనే నినాదంతో కులం, మతం, లింగ భేదం లేకుండా అందరికీ విద్యను అందించాలని పూనుకొని ఆనాటి సాంప్రదాయ మత ధోరణులు అవలంభిస్తున్న ఆచార వ్యవహారాల పేరుతో, కులం, వివక్షత, అంటరానితనం, కట్టుబాట్లు స్త్రీలపై వివక్షతలపై పట్టి పీడిస్తున్న కాలంలో ప్రజలను సంఘటిత పరిచారు. తరతరాలుగా విద్యను, దేవాలయాల ప్రవేశానికి, అవకాశాలు పొందని జాతుల విముక్తి కోసం, శివలింగాలను ప్రతిష్టించి, దాని ప్రక్కన ఒక అద్దం పెట్టి ముందుగా అద్దం చూసుకొని తర్వాత దేవున్ని చూడండి. దేవుడు నీలో ఉన్నాడు అని బోధించారు. అవర్ణులకు చదువుల తల్లిగా శారదాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించి విద్య ద్వారా మాత్రమే స్వేచ్ఛ, ప్రతిఘటించడం ద్వారా శక్తి పరిశ్రమించడం ద్వారా ప్రగతి సాధించగలమని, ఇవి దేవాలయాలు కావు విద్యాలయాలు అని విద్యావ్యాప్తికి శ్రీకారం చుట్టారు.

అన్ని మతాల సారం ఒక్కటే ఎవరినీ విమర్శించ కుండా, ద్వేషించకుండా అహింసా పద్ధతిలో తన పోరాటాన్ని కొనసాగించారు. శివగిరిలో ఒక బ్రహ్మ విద్యాలయాన్ని స్థాపించి అన్ని మతాల కులాల వారికి విద్య నందించారు. మనిషి ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవాలని మహిళలను, పురుషులతో సమానంగా చూడాలని చెప్పారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరం మద్యపానాన్ని నిషేధించాలని ప్రజలను కోరారు.

శ్రీనారాయణ గురు బోధనలకు చైతన్యవంతులైన అనేకమంది గురు ధర్మ పరిపాలన యోగంను స్థాపించి విద్యావ్యాప్తికి గ్రామ గ్రామాన పాఠశాలలు స్థాపించి విద్యనందిస్తున్నారు. కృషి ఫలితంగా కేరళలో నూరుశాతం అక్షరాస్యతను సాధించింది. సర్వమత సమ్మేళనాలను నిర్వహించి మత సామరస్యాన్ని చాటిచెప్పాయి. ఆర్థిక విధానాలు, అభివృద్ధి సాధించే దిశను వ్యాపార పరిశ్రమలు నెలకొల్పుకోవాలని, స్వేచ్ఛ వాణిజ్యం సమసమాజానికి దారి తీయాలని దానికి నిర్మాణాత్మకమైన వ్యవస్థలను ఏర్పాటు చేయడం. కులం, మతం, జాతి, లింగ భేదం లేకుండా అందరికి గౌరవప్రదమైన జీవనం, భద్రత ఉండాలని కృషి చేయడం వారి లక్ష్యాలు. శ్రీ నారాయణ గురు చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగించడానికి కేరళ రాష్ట్రంలో ప్రధానంగా మూడు సంస్థలు పనిచేస్తున్నాయి.

శ్రీనారాయణ గురు ధర్మ పరిపాలనాయోగం, ధర్మసంఘం, గురుకులం గురు ధర్మప్రచారం సభ (అంతర్జాతీయ సంస్థ)

గురుదేవుని ఆలోచనా విధానం, సిద్ధాంతాన్ని, బోధనలను బోధించడం, ప్రచారం చేయడం, మంచి పౌర జీవనానికి మార్గదర్శకత్వం వహించడం, విద్యాకేంద్రాలను స్థాపించి ఆధునిక విద్య అవకాశాలు పొందుటకు సాంకేతిక, శాస్త్ర విద్యను, శిక్షణను ఇవ్వడం కుల, మత సామరస్యాన్ని సాధించే దిశగా కృషి చేయడం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో చైతన్యాన్ని, ఐక్యతను, సాధికారతను సాధించుట. అనాథ, వృద్ధులు, వికలాంగుల సంక్షేమం కొరకు పాటుపడడం సమీకృత విధానాన్ని రూపొందించి వారికి వివిధ పథకాలు చేపట్టి అమలు చేయడం.

భారతదేశంలో సామాజిక ఉద్యమకారులలో మహాత్మా జ్యోతిరావు ఫూలే పెరియార్ రామస్వామి నాయకర్




బాబాసాహెబ్ అంబేద్కర్ శ్రీ నారాయణ గురు విప్లవాత్మకమైన మార్పును, దళిత, వెనుకబడిన, వివక్షకు గురైన మహిళా, జాతుల విముక్తికి జీవితాంతం పోరాడి గెలిచిన వీరులు. శతాబ్దాల పోరాట కృషి ఫలితం భారత దేశ స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగంలో దళిత, గిరిజన, వెనకబడిన వర్గాల వారికి హక్కులను, హామీలను గ్యారంటీ చేసింది.

భారతదేశాన్ని స్వతంత్ర 'సార్వభౌమ' గణతంత్ర రాజ్యంగా తీర్చిదిద్దాలన్నదే తమ నిబద్ధమైన లక్ష్యమని రాజ్యాంగ పరిషత్ ప్రకటించింది. భారత ప్రజలందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కల్పించడానికి, సామాజిక హోదా పెంచడానికి, ప్రజా పరిపాలనా చట్టాలు అవకాశాలు కల్పించాలని భావ వ్యక్తీకరణ, స్వేచ్ఛ, మత విశ్వాసాన్ని కల్గివుండటం వృత్తులు, కల్పించడం రాజ్యాంగం యొక్క ముఖ్య ధ్యేయం. అంతేకాకుండా మైనారిటీల, వెనుకబడిన, దళిత, గిరిజనుల వర్గాల పురోగాభివృద్ధికి తగినన్ని పరిరక్షక విధానాలను పొందుపరిచారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ...

మనం ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సాంఘిక ప్రజాస్వామ్యంగా కూడా మలచాలి. సమాజం పునాదుల్లో సాంఘిక ప్రజాస్వామ్యం బలంగా ఉంటేనే పైన రాజకీయ ప్రజాస్వామ్యం మనగలుగుతుంది. సాంఘిక ప్రజాస్వామ్యం అంటే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలు మౌలిక జీవిత సూత్రాలుగా గుర్తించే జీవన విధాన, స్వేచ్ఛ లేకుండా సమానత్వం ఉండదు. సమానత్వం లేకుండా స్వేచ్ఛ ఒక్కటే ఉంటే అతి కొద్దిమంది బలవంతులు, అసంఖ్యాకులైన బలహీనులపై ఆధిపత్యం చెలాయించడానికి దారితీస్తుంది.

స్వేచ్ఛ లేకుండా సమానత్వం ఉంటే అది వ్యక్తిగత చొరవను క్రియాశీలతను హరించివేస్తుంది. సౌభ్రాతృత్వం (సోదరభావం) లేకుండా స్వేచ్ఛ సమానత్వాలు రెండు చాలా అసహజంగా, కృతకంగా మిగిలిపోతాయి. ఇక్కడ మనం రెండు విషయాలను స్పష్టంగా అంగీకరించాలి. భారత సమాజంలో రెండు అంశాలు మచ్చుకు కూడా కనబడలేదన్న వాస్తవాన్ని మనం గుర్తించక తప్పదు. మొదటిది సమానత్వం రెండవది సౌభ్రాతృత్వం అంటే మనం భారత ప్రజలందరమూ ఒకటేనన్న భావన, సోదరభావంతో అంతా కలిసిమెలిసి ఉండే తత్వం మన సామాజిక జీవనంలో ఐక్యతనూ, సమూహతత్వాన్ని, సంఘీభావాన్ని తెచ్చిపెట్టేది ఇదే, దీనిని సాధించుట అంత తేలిక కాదు. సౌభ్రాతృత్వం లేకుండా స్వేచ్ఛ, సమానత్వాలు రెండూ పైపై మెరుగులుగానే మిగిలిపోతాయి.

యస్.సి, యస్.టిల కోసం రాజకీయ, సామాజిక అభివృద్ధి కోసం రాజ్యాంగం ఒక సమగ్రమైన నిబంధనల చట్టాన్ని సిద్ధం చేసింది. రాజ్యాంగంలో అధికరణ 14 చట్టం ముందు అందరూ సమానులే 15 కుల, మత, లింగ ప్రాంతీయ వివక్షతలను నిషేధించింది. 16 ప్రభుత్వ ఉపాధి అవకాశాలలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. యస్.సి, యస్.టి. లకు రిజర్వేషన్లు కూడా కల్పించడం17వ అధికరణ అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించింది.

పేదలకు సంబంధించి రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు దేశ పరిపాలనా రంగానికి మౌలికసూత్రాలు. 38వ అధికరణ జాతీయ జీవనంలో అన్ని వ్యవస్థల్లోనూ సామాజిక, ఆర్థిక రాజకీయ సమన్యాయం అందించాలని చెబుతుంది. 39 అధికరణలో పౌరులందరికీ తమకు తగిన జీవన భృతిని సముపార్జించుకునే హక్కును కల్పిస్తుంది. భౌతిక వనరులపై ఏ ఒక్కరి గుత్తాధిపత్యం లేకుండా సమానస్థాయిలో కల్పించాలని, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, సంపదలు, ఉత్పత్తి సాధనాలు, సంక్షేమానికి హాని కల్పించేలా కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చూడాలని స్పష్టం చేసింది. స్త్రీ పురుషులకు సమానవేతనం, పిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగేందుకు అవకాశాలు ఇలా 41, 43, 45, 46, 330, 332, 244, 244 ఎ 5, 6 షెడ్యూల్‌లో అనేక అంశాలపై రాజ్యాంగం హామి ఇచ్చింది.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు చేయడానికి యుద్ధ ప్రాతిపదికన పూనుకుంది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు విద్యా, అవకాశాలు, భూ పంపిణీకి ఆర్థిక విధానాల్లో పంచవర్ష ప్రణాళికల్లో అధిక నిధులు వెచ్చించి సంక్షేమానికి పాటుపడింది. 70వ దశకంలో యస్.టి.లకు



సబ్‌ప్లాను, యస్.సి.లను ప్రత్యేక కాంపొనెంట్ ప్లాను అమలు చేయాలని, కేంద్రమే కాకుండా రాష్ట్రాలు కూడా అమలు చేయాలని చెప్పారు. భూ సంస్కరణలో భాగంగా మిగులు ప్రభుత్వ భూములను పెద్దఎత్తున పంపిణీ చేశారు. పాఠశాల విద్య, ఉన్నత విద్యను, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లను ఏర్పాటు చేసి విద్యనందించింది. బలవంతపు నిర్బంధ విద్య. విద్యాహక్కు చట్టం రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు వలన ప్రభుత్వ ఉద్యోగంలో అవకాశాలు పొందారు. అన్ని రకాల వివక్షతలను రూపుమాపడానికి జాతీయ కమిషన్లు ఏర్పాటు చేశారు. 80, 90 దశకం వరకు ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాయి. తర్వాత కాలంలో విద్యావంతులైన యస్.సి, యస్.టి., బి.సి లు రాజ్యాంగ హక్కుల కొరకు పెద్ద ఎత్తున ఉద్యమించడం వలన సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో కొంతమేరకు విజయం సాధించారు.

కాలక్రమంలో భారతదేశంలో ఆర్థిక సంస్కరణలలో భాగంగా, శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి పారిశ్రామికీకరణ చెందుతున్న తరుణంలో ప్రభుత్వాలు సంక్షేమం నుండి క్రమంగా వైదొలుగుతూ నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. సరళీకరణ ప్రైవేటీకరణ, గ్లోబలీకరణ పేరుతో విద్యను, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటీకరించి మార్కెట్ విధానాన్ని తీసుకువచ్చింది. పెరుగుతున్న జనాభాకు తగినట్లు, పేదరిక నిర్మూలనకు ఎటువంటి చర్యలు ప్రణాళికల్లో ప్రస్తావన క్రమంగా తగ్గుతున్నది. వ్యవసాయం ప్రధాన రంగంగా ఉన్నప్పుడు దళితులు, వెనుకబడిన తరగతుల వారు భూమిలేని వ్యవసాయేతర కూలీలుగా అధిక శాతం పేదలు ఆధారపడి జీవించారు. పారిశ్రామిక విధానం, పట్టణీకరణ వలన 40 శాతం గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పోయి పట్టణాలలో అసంఘటిత రంగంలో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఇపుడు భూమి పంపిణీ స్థానంలో ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేయవలసి వస్తుంది. వ్యవసాయం ప్రస్తుతం పరిస్థితుల్లో లాభసాటి లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో కౌలుదారుగా అధికశాతం దళితులు కూలీలుగా పనిచేసి ఆత్మహత్యలకు గురవుతున్నది వీరే. దాదాపు 60 శాతం కౌలుదారులుగా జీవిస్తున్నారు. నేటికీ ప్రభుత్వాలు కౌలువిధానంపై ఒక సమగ్రమైన అధ్యయనం విధానం ఏమీ లేదు. విద్య విషయానికి వస్తే నేడు ప్రైవేటు, కార్పొరేటు చదువులు, ఇంగ్లీషు సాంకేతిక విద్య, ఇంజనీరింగు, మెడిసన్, కంప్యూటర్ విద్యను అభ్యసించాలంటే ప్రస్తుతం వున్న పోటీతత్వంలో పేదలకు అందని ద్రాక్షలా మిగిలిపోయింది. రాను రాను ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ప్రైవేటు రంగంలో ప్రతిభకు అవకాశం ఉన్నందున ఇక ప్రవేశం లేదు.

విద్యాహక్కు చట్టం చేసినప్పటికీ రాష్ట్రంలో ఇంకా అమలుకు నోచుకోలేదు. రాజకీయ రంగంలో కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలే.

ఒకనాడు సంక్షేమం అంటే విద్య, అవకాశాలు ఉపాధి ప్రోత్సహించే విధంగా ఉండేది. నేడు అవి నినాదాలే. ప్రస్తుతం విధానాలన్నీ తాత్కాలికమైనవి. రూపాయి కిలోబియ్యం, పప్పులు, సబ్సిడీలు, ఉచితాలు అన్ని పేదరికంలోకి, చీకటిలోకి నెట్టివేయడమే. మద్యం ఏరులై పారించి మానసికంగా ఎదుగుదల లేకుండా చేయడమే నేటి పాలకుల లక్ష్యం.

అందుకే మనందరం మన మహనీయులు చూపిన మార్గంలో పయనిద్దాం. శ్రీ నారాయణ గురును ఆదర్శంగా ఆయన ఆలోచనా విధానాన్ని అనుసరించి భవిష్యత్తు తరాలకు మంచి భవిషత్తును అందిద్దాం.

డిశంబరు 30, 2011న ఉదయం 10 గం॥ లకు ప్రారంభోత్సవం మరియు విద్యా అవకాశాలపై సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి కేరళ ముఖ్యమంత్రి ఉమెన్‌చాండీ, కేంద్ర మంత్రి కె.పి. థామస్ నారాయణ గురు ధర్మసంఘం ట్రస్టు ప్రధాన కాపరులు బ్రహ్మశ్రీ ప్రకాశానంద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్, లోక్‌సత్తా పార్టీ తరపున సర్వజన సత్తా రాష్ట్ర కోశాధికారి పి. హనుమంతరావు మాట్లాడారు. నేటి మన భారతదేశం విభిన్న మతాలు, కులాలు, జాతుల సంస్కృతిలో జన జీవనం కొనసాగుతున్నదని, నేటి సమాజానికి శ్రీ నారాయణగురు బోధనలు ఆదర్శవంతమైన ఆచరణాత్మకమైనవని, శ్రీ నారాయణ గురు ఆలోచనా విధానాన్ని అమలు చేయుటకు లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో పుట్టుకతో వివక్షతకు తావు లేకుండా అందరికీ విద్యా అవకాశాలు, ఎదిగే అవకాశాలు కల్పించుటకు శ్రీ జయప్రకాష్ నారాయణ్ ఐఏయస్, ఎమ్మెల్యే నాయకత్వంలో సామాజిక న్యాయసాధన దిశగా కృషి చేస్తున్నదని చెప్పారు. మూడవ రోజు జరిగిన సెమినార్‌లో సర్వజన సత్తా రాష్ట్ర అధ్యక్షులు ఈద చెన్నయ్య మాట్లాడారు. ■

# లోక్‌సత్తా పార్టీ విధానాలకు దర్పణం

- మైత్రీజ్వాల

## మీడియా రిలీజుల పుస్తకం

**పుస్తక సమీక్ష**

సినిమాహాళ్లు, షాపింగ్‌మాళ్ళ మెట్లవద్ద, ఎస్కెలెటర్లలో పెద్ద పెద్ద అద్దాలు పెడతారు. ఆధునిక భవంతుల లిఫ్టులలోను అద్దాలు వుంటాయి. అద్దం ముందు అసలే నిలబడనివారైనా, ఎంత అందవికారులైనా ఈ అద్దాలముందుకు వచ్చినప్పుడు ఏదో ఒక చేష్ట చేస్తారు. తలదువ్వుకోవడమో, వెళుతూ వెళుతూ జుట్టు సవరించుకోవడమో కనీసం ఆగి తమ ముఖాన్ని ఒకసారి చూసుకుంటారు. కొంచెం భేషజం ఉన్నవారైతే అద్దం వంక ఒక 'దొంగ' చూపైనా చూస్తారు. "అద్దం ముందు చేష్టలు" అనే ఒక పెద్ద సర్వే జరిగింది. అద్దం ముందు రకరకాల వ్యక్తులు ఎలా వ్యవహరిస్తారో ఆ సర్వే తేల్చి చెప్పింది.

రాజకీయ పార్టీలలో 'సారా' పార్టీలను మినహాయిస్తే, ఎప్పుడు చారిత్రక తప్పిదాలను చేస్తూ తప్పులు ఒప్పుకుంటూ మళ్ళీ మళ్ళీ అవే తప్పులు చేసే పార్టీలు కొన్ని. కన్నాలు కనపడుతున్నా అదే తమ ప్రత్యేకతంటూ "తప్పులతడక" పార్టీలు కొన్ని. దేవతావస్త్రాలు ధరించిన పార్టీలు, వంకరటింకర పార్టీలు మన సమాజంలో ఎన్నో వున్నాయి. **'ఎప్పటికయ్యేది అప్పటికా మాటలాడి తప్పించుకుతిరుగువాడే ధన్యుడు సుమతి'** అన్న సుమతి శతకకారుడి పద్యాన్ని తూ.చ తప్పకుండా పాటించే పార్టీలు మరికొన్ని.

కాలప్రవాహంలో కొట్టుకుపోయే పార్టీలు అవసరం లేదు. కాలం అనే పరీక్షనాళికలో నిగ్గుతేలే పార్టీలు కావాలిప్పుడు. కాలంతో పాటు ముందుకు నడిచే పార్టీలు కావాలి. గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం మన సమకాలీన సాహిత్యంలో నేటికీ ఆణిముత్యంల్లాంటి రచనే. ఆ నాటకంలో పాత్రలు నేటి సమాజంలో కూడా కనపడతాయి. సాహిత్యానికి భవిష్యద్దర్శనం ఎలాగో రాజకీయపార్టీలకు అంతకంటే ఎక్కువ దర్శనం కావాలి. గతమెంతో ఘనం అని పొగుడుకునే పార్టీలకంటే భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకునే పార్టీ కావాలి. ఆదిత్య 369 సినిమాలోలాగా భవిష్యత్తులోకి వెళ్ళగలగాలి. లక్ష్యం సుదూరం అయినప్పుడు సముద్రంలో కనపడే దీపాల వెంట పోరాదు. సముద్రతీరంలో దూరంగా కనపడే (లైట్‌హౌస్)దీపపు స్తంభాలే అసలు తీరాన్ని చేరుస్తాయి. చివరగా ఒకమాట ప్రజలనే అద్దం ముందు ప్రతి ఐదేళ్ళకోసారి పార్టీలు శీలపరీక్షకు నిలబడాల్సివుంటుంది. కాని ఆ అద్దం ఏ విచిత్రప్రతిబింబాన్ని చూపే కుంభకటకాకారం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యావంతులది, పౌరసమాజానిది. లోక్‌సత్తా మీడియా రిలీజెస్ ఒక సంవత్సరం పార్టీ విధానాలకు ప్రజల పక్షాన నిలబడ్డ సందర్భాలకి సజీవ సాక్ష్యం. ఏ పార్టీ చేయని ప్రయోగం ఈ పుస్తకం ద్వారా లోక్‌సత్తా చేయడం అభినందనీయం. ■



# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి : రాష్ట్ర నాయకుల పిలుపు

## చిలకలూరిపేట పార్టీ కార్యక్రమాలు

**మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి**

మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్రాశ్రీధర్, రమేష్‌రెడ్డి కోరారు. కళామందిర్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు చెప్పారు. సమాజంలో బాధ్యత ఉన్న నిజాయతీపరులకు పోటీ చేసే అవకాశాన్ని తమ పార్టీ కల్పిస్తుందన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదాసు భానుప్రసాద్, అబ్దుల్ జబ్బార్, కామినేని ఆంజనేయులు, ఖాదర్, కిరణ్‌సింగ్, మహ్మద్‌సాదిక్, నాగరాజు, అబ్దుల్ రజాక్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

**'అపరిశుభ్రతతో ప్రబలుతున్న రోగాలు'**

**చిలకలూరిపేట టౌన్ :** లోక్‌సత్తా పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి మాదాసు భానుప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యులు 21 వార్డులో పర్యటించి సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మంగారి గుడివెనుక బజారులో సిల్టు తీయకపోవడం వలన దుర్గంధం, దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు తెలిపారు. గడియార స్తంభం సెంటర్‌లో పైప్‌లైన్ లీకులతో నీరు వృధా అవుతుందని బృందం దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్, కార్యదర్శి ఎం.ప్రసాద్, నాందేడు ప్రసాద్, ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

**ట్రై సైకిల్ అందజేత**

**చిలకలూరిపేట:** ప్రమాదవశాత్తూ కాలు పోగొట్టుకున్న ఏసు అనే రిక్షా కార్మికునికి లోక్‌సత్తా పార్టీ నాయకులు ట్రై సైకిల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ నాయకులు మాదాసు భాను ప్రసాద్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కోటి మందికిపైగా అసంఘటిత కార్మికులు ఉన్నారని, అనుకోని ప్రమాదాలు జరిగితే వారి కుటుంబాలు వీధిన పడే ప్రమాదం పొంచివుందని, కావున ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలు విడనాడి కార్మికుల జీవనభద్రతకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మురికిపూడి ప్రసాద్, దాత పావులూరి రత్నాకర్, నందేటి ప్రసాదరావు, షేక్‌సాదిక్, కిరణ్‌సింగ్, వెంకట్రావులు పాల్గొన్నారు.

## విజయవాడ పుస్తక ప్రదర్శనలో

# లోక్‌సత్తా మీడియా రిలీజ్‌లు పుస్తకం ఆవిష్కరణ

లోక్‌సత్తా పార్టీ 2010 సంవత్సరంలో విడుదల చేసిన మీడియారిలీజ్‌లను పుస్తకరూపంలో ప్రచురించింది. జనవరి 5న విజయవాడలో జరిగిన జాతీయ పుస్తక ప్రదర్శనలో ఈ పుస్తకాన్ని పార్టీ ప్రచురణల విభాగం కన్వీనర్ బండారు రామ్మోహనరావు ఆవిష్కరించారు. ప్రముఖ వైద్యులు, లోక్‌సత్తా రాష్ట్రనాయకులు కామినేని పట్టాభిరామయ్య తొలి ప్రతి ఖరీదుచేశారు. ఈ కార్యక్రమంలో మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.సరోజాదేవి, పార్టీ రాష్ట్ర నేతలు బసవేశ్వరరావు, అనుమోలు గాంధీ, పార్టీ జిల్లా అధ్యక్షులు చెన్నుపాటి వజీర్, పట్టణ అధ్యక్షులు చుండూరి రాజేంద్రప్రసాద్, మహిళాసత్తా జిల్లా కార్యదర్శి వాడపల్లి శ్రీదేవి, ప్రచార కార్యదర్శులు పొట్లూరి కృష్ణారావు, దంతనాల జగన్మోహనరావు, జిల్లా యువసత్తా కార్యదర్శి గట్టం శివకుమార్, యువసత్తా అర్బన్ అధ్యక్షులు కళ్యాణం విజయ్‌కుమార్, అర్బన్ లీగల్ సెల్ కన్వీనర్ బురదగుంట అశోక్ కుమార్, అర్బన్ కార్యదర్శి బండ్లమూడి మురళికృష్ణ, యువసత్తా కార్యదర్శి పెందురి మధు, నార్ల మాలతి, రాజమణి, నాగమణి, విజయలక్ష్మి, పిల్లలమర్రి సరళకుమారి, జి.వి.యస్. రాజు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వమే మద్యం వ్యాపారం చెయ్యాలి

## విజయనగరం జిల్లా పార్టీ కార్యక్రమాలు



మద్యం షాపులను వేలం వేయకుండా ప్రభుత్వమే డిపోలుగా తెరిచి సమయం ప్రకారం మద్యం విక్రయాలు సాగిస్తే బెల్టుషాపుల గొడవ ఉండదని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఫుల్లుగా తాగండోయ్ బాబు, ఖజానా నింపండని' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలు విచ్చలవిడి చేయడంతో రాష్ట్రం మధ్యాంధ్ర ప్రదేశ్‌గా మారిపోయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 16వేల కోట్ల రూపాయలు మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం పొందాలని కోరుకోవడం అత్యంత హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

**జనం చేతికి అధికారం రావాలి**

మున్సిపాలిటీల్లో వచ్చే ఎన్నికల్లో ప్రజల చేతికే అధికారం వచ్చే విధంగా వ్యవహరించాలని లోక్‌సత్తా ప్రతినిధి వెలుగూరి సురేష్ అన్నారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని 14.24 వార్డుల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖర్చుచేసే ప్రతి రూపాయికి లెక్కలు సేకరించినప్పుడే ఎన్నికలు సజావుగా సాగుతాయన్నారు. 14 వార్డుల్లో ఆ పార్టీ జిల్లా నాయకులు ఎం.ఎస్ఎన్.రాజు, 24 వార్డులో యువసత్తా జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో ప్రతినిధులు గౌరి లక్ష్మీ, డి.వీర్రాజు, సిహెచ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

**సమాజ హితమే ధ్యేయంగా సేవలు**

సమాజ సేవే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేసినప్పుడు ఆర్థిక అసమానతలు సమసిపోతాయని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు బి.తిరుపతిరాజు అన్నారు. పట్టణంలోని ఒక హోటల్ లో అంతర్జాతీయ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన తిరుపతి రాజు మాట్లాడుతూ సమాజంలో ఉండే సమస్యల పట్ల ప్రతి ఒక్కరు మానవత్వంతో స్పందించాలన్నారు. వృత్తి, ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఎమ్మెల్సీ గాచె శ్రీనివాసులు నాయుడు, సాలూరు ఎమ్మెల్యే రాజన్నదొర మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సమాజం కోసం ఆలోచించాలన్నారు ఈ సందర్భంగా పోతన్న, భీశెట్టి బాబ్జీ, ఎన్.రాజు, పి.వి. నర్సింహ రాజు, ఎ.ఎస్.ప్రకాశ్‌రావు, ఆనంద్ కాంతారావు, పద్మనాదం తదితరులు పాల్గొన్నారు.

**బందలుప్పిలో మంచినీటి సమస్య**

**విజయనగరం :** పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామంలో సరైన మంచినీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తు లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన ప్రజలు కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ బందలుప్పి గ్రామంలో సుమారు 5 వేల మంది జనాభా ఉన్నప్పటికీ ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం విచారకరమన్నారు. ప్రజలకు కనీస అవసరమైన నీటిని అందించలేని అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని గ్రామస్థులతో కలిసివెళ్లి కలెక్టర్ వీరబ్రహ్మయ్యలకు అందించారు. మహిళలు, గ్రామపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

## రాయదుర్గం నియోజక వర్గం బొమ్మనహాళ్ మండలంలో రైతు చైతన్య యాత్ర

రైతు పండించిన ధాన్యానికి ప్రభుత్వమే మద్దతు ధర కల్పించాలి, లేదా ప్రభుత్వమే ధాన్యాన్ని కొనాలి, లేదా మిల్లర్లచే కొనిపించాలి అంటూ లోక్‌సత్తా పార్టీ తాలుకా అధ్యక్షుడు బి.బాబు బొమ్మనహాళ్ మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన రైతు చైతన్యయాత్రలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బి.బాబు ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు, లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధర్‌గట్ట, దేవగిరి, గుంతకల్లు క్రాస్ తదితర గ్రామాల్లో పర్యటించి రైతు చైతన్యయాత్రలను నిర్వహించారు. దేశానికి తిండికొరత లేకుండా రైతులు కష్టపడి పంటలు పండిస్తుంటే వాటిని అమ్ముకోవడానికి, నిల్వ చేసుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ప్రభుత్వం రైతులకు కల్పించలేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు గత్యంతరం లేక ఆత్మహత్యలు చేసుకొంటున్న ప్రభుత్వం మొద్దునిద్రలో వుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం, పాలకుల విధానాల లోపమే రైతుల పాలిట శాపాలయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈశ్వర్‌రెడ్డి, నాగరాజురెడ్డి, వెంకటసుబ్బయ్య లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎస్.కె.అబ్దుల్లా, రియాజ్, లోకేష్, రాజు పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా పార్టీ కార్యక్రమాలు**

# రోడ్ల విస్తరణ కోసం నంద్యాలలో నిరాహారదీక్షలు

**నంద్యాల :** నంద్యాల పట్టణంలో బైరుమల్ వీధి, నాగులకుంట రోడ్, మెయిన్‌బజార్ (బంగారు అంగళ్ళవీధి) సాయిబాబా నగర్ మరియు వివిధ రహదారులు విస్తరణ చేయడానికి కొలతలు వేసారు, పనులు ప్రారంభించలేదు. కారణాలు రాజకీయ నాయకులకే తెలియాలి. ఆక్రమణాలకు గురై నంద్యాల రోడ్లు కుంచించుకుపోతున్నాయి. జనాభా ఇంతకు ఇంతై – పందింతలు పెరిగింది. పెండింగ్ వేసిన రోడ్ల విస్తరణ చేపట్టి ప్రజల కష్టాలు తీర్యాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ నంద్యాల జనవరి4,5,6 తేదిలలో మూడు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.హమీద్, పి.ఎన్.క్రిష్ణ కుమార్, జి.వెంగళరెడ్డి గారు దీక్షలో యన్.పి.దాన్, పి. ప్రభాకర్, ఆర్.కె.చైతన్య, డి.శ్రీనివాస్, టి.ఎమ్.డి.ఫరూక్, కూర్చున్నారు. జి.వి.రమణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ఓంకార్‌గారు యస్.ఇక్బాల్‌భాష,ఈ దీక్షాశిబిరాన్ని ప్రారంభించారు.

**కర్నూలు జిల్లా పార్టీ కార్యక్రమాలు**

### లోక్‌సత్తా క్యాలెండర్ల ఆవిష్కరణ

**పత్తికొండ టౌన్ :** మెరుగైన సమాజం కోసం లోక్‌సత్తా పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆనందాచారి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రగుడి నారాయణస్వామి చేతుల మీదుగా పార్టీ సభ్యులు నూతన సంవత్సర క్యాలండర్లను విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా లోక్‌సత్తా ప్రజా సమస్యల పరిష్కారం, రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా, సమసమాజ స్థాపనకు నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాధవ రెడ్డి, ప్రసాద్, మహమ్మద్ చాంద్‌భాషా, కాశీం, ఎర్రిస్వామి, లక్ష్మన్న, జాకీర్, కాశీంవలి పాల్గొన్నారు.

# కల్తీ సారా మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలి

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కృష్ణా జిల్లా మహిళాసత్తా నాయకులు

**విజయవాడ :** కల్తీసారా సంఘనలో మైలవరం మండలం, పోరాటనగర్ కనిమెర్ల తాండా, నాగలూరు తాండాలలో కల్తీసారా త్రాగి మూడు తాండాలకు చెందిన 19మంది ప్రాణాలు కోల్పోగా, 18 మంది చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబాలను మహిళాసత్తా కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో మహిళాసత్తా అధ్యక్షురాలు వంగర నాగమణి, అధికార ప్రతినిధి రాజమణి, లీగల్‌సెల్ అధ్యక్షురాలు జ్ఞానంబా మరియు కృష్ణవేణి వెళ్ళి పరామర్శించారు. అక్కడ వారి ఫిర్యాదులు, బాధిత కుటుంబాల బాధలు వివరంగా తెలుసుకోవడం జరిగింది. ఎక్సైజ్‌శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి వుంటే ఇలాంటి ఘటనలు జరగటానికి అవకాశం వుండదు. వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం ఇచ్చి పిల్లలకు చదువులు, ఉద్యోగాలు ఏర్పాటు చేయవలసిన అవసరం వుంది.

**కృష్ణా జిల్లా పార్టీ కార్యక్రమాలు**

# పార్టీ నాయకులు ప్రజలతో మమేకం కావాలి.

## విజయవాడ 51వ డివిజన్ మున్సిపల్ శిక్షణ

లోక్‌సత్తా కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి రోజువారీ సమస్యల పట్ల స్పందించాలని లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు ఎన్. నాగేంద్రబాబు అన్నారు. విజయవాడ 51వ డివిజన్‌లో డిశంబరు 27న జరిగిన మున్సిపల్ వార్డు శిక్షణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేసినప్పుడు లోక్‌సత్తా పార్టీకి ఓట్లు వస్తాయని శిక్షణ రిసోర్సుపర్సన్ సాంబిరెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ అర్బన్ అధ్యక్షులు చుండూరి రాజేంద్రప్రసాద్, జిల్లా మహిళాసత్తా కార్యదర్శి వాడపల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ విద్యకు పునాది వేసిన సావిత్రీబాయి పూలే

**లోక్‌సత్తా పార్టీ ఘన నివాళి**



Savitribai Phule

మహిళాసత్తా, సర్వజన సత్తా నాయకులు పార్టీ ప్రధాన కార్యాలయంలో జనవరి 3, 2012న సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్వజనసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వి.రావు మాట్లాడుతూ స్త్రీ విద్యకు పునాది వేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని అన్నారు. మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.సరోజాదేవి మాట్లాడుతూ స్త్రీని బానిసగా చూసే ఆనాటి సమాజంలో భర్త మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలకు అనుగుణంగా సావిత్రీబాయి పూలే వంటి మహనీయుల కృషి, త్యాగ నిరతులను ఆదర్శంగా తీసుకోవాలి. ప్రభుత్వం కూడా సావిత్రీబాయి పూలే పోరాట పటిమను ఎల్ల వేళల గుర్తుంచుకుని.. దేశవ్యాప్తంగా పట్టణ స్థాయిలోనే కాక, గ్రామస్థాయిలో కూడా దళితులకు, వెనుకబడిన తరగతులవారికి, మహిళలకి మెరుగైన విద్యను ఉచితంగా అందించేవిధంగా స్కూల్స్‌ని, అన్ని వసతులతో హాస్టల్స్‌ని ఏర్పాటుచేసి వారి ఉన్నతికి పాటుపడితేనే అది సర్వత్రా అభినందనీయం అవుతుంది. అని అన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి శిక్షణ కేంద్రాలకు కాసుల కిరణాలు

## యువసత్తా కార్యక్రమాలు

**తిరుపతి : రాజీవ్ యువకిరణాలపై యువసత్తా విమర్శ**

యువసత్తా నిర్వహించిన యూత్ అసెంబ్లీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచేసిన అసెంబ్లీ మాజీస్పీకర్ ఈశ్వర్‌రెడ్డి గారు మాట్లాడుతూ తాను 1980-83 వరకు అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసినప్పటి రాజకీయానికి ఇప్పటి రాజకీయానికి పొంతనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి రాజకీయంలో నైతిక విలువలు దిగజారాయని డబ్బు, మద్యం ద్వారా రాజకీయాలు నడిపిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు పి. శివాజీ రాజు మాట్లాడుతూ రాజీవ్ యువకిరణాల పథకం.. శిక్షణ కేంద్రాలకు కాసుల కిరణాలుగా మారిందని విమర్శించారు. ఈ పథకం కింద డిసెంబర్ 31 నాటికి లక్ష ఉద్యోగాలిచ్చేశామని ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిందన్నారు. వాస్తవానికి 25 వేల మందికి ఉపాది కల్పించారని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ లక్ష ఉద్యోగాలిచ్చి ఉంటే ఆ ఉద్యోగుల వివరాలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 28 శిక్షణా కేంద్రాలకు ప్రభుత్వం కాంట్రాక్టు అప్పగించిదని, అందులో కల్పించినట్లుగా కాగితాలపై చూపి డబ్బు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము సీఎంకు ఫిర్యాదు చేశామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సత్తా కో-ఆర్డినేటర్ మారంరెడ్డి శ్రీకవాంత్‌రెడ్డి, లోక్‌సత్తా నగర అధ్యక్షుడు నీలకంటేశ్వర, కేశవులు శెట్టి, యువసత్తా నాయకులు విజయ్, శివ, అశోక్, కార్తీక్, మున్నా, సాయికిరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

**యువజన దినోత్సవ సందర్భంగా యువసత్తా రాష్ట్రఅధ్యక్షులు పిలుపు**

**అమలాపురం :** స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో యువసైనిక్ సంస్థ యువజన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి యువతీయువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు శివాజీరాజు మాట్లాడుతూ వివేకానందుడి ఆశయాలని "యువతా మేలుకో-దేశాన్ని ఏలుకో" అన్న ఆయన కలలను నిజం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు యువత దూరంగా ఉన్న కారణంగానే దేశంలో అవినీతి, అశాంతి రోజు రోజుకి పెరిగి పోతుందని అన్నారు. యువత రాజకీయాలోకి రాకుండా మార్పు రాదన్నారు. యువతని తాత్కాలిక తాయిలాలిచ్చి కేవలం ఓటు బ్యాంకో రాజకీయాలకు వాడుకొని వారి జీవితాలన్ని నాశనం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో "యువ సైనిక్'' వ్యవస్థాపకుడు బాస్కర్, యువసత్తా నాయకులు అజీత్, చైతన్య, రాజు మరియు వర్తక సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

**మేడ్చల్ :** పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎమ్మెల్యే స్పందించి మేడ్చల్‌లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సత్తా నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఒక రోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గంలో కళాశాల లేకపోవడంతో ఎంతో మంది పేద విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువసత్తా, విద్యార్థిసత్తా నాయకులు వినోద్‌రెడ్డి, సాయిపృథ్వీ, సాయికుమార్, నాగరాజు, అజీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలపై ఉద్యమం ఒంగోలు సంతపేట**

ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలకు సిద్ధం కావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. యువసత్తా విద్యార్థి సత్తా రాజకీయ శిక్షణ తరగతులు స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నిర్వమించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ సభ్యత్వం పెంచటానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు పి. శివాజీరాజ్, రాష్ట్ర నాయకులు అజిత్, చైతన్య నాయకత్వం, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. హెచ్. రత్న కుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ అహ్మద్, మహిళాసత్తా అధ్యక్షురాలు కరీమున్నిసా, పట్టణ అధ్యక్షుడు వి. అంజనేయుల పాల్గొన్నారు.



అమలాపురంలో వివేకానందుని జయంతి సందర్భంగా యువసత్తా కార్యకర్తలు



విజయవాడ పుస్తక ప్రదర్శనలో మీడియా రిలీజులు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం



హైదరాబాద్‌లో వివేకానందుని జయంతి సందర్భంగా
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, తదితరులు




మద్య నియంత్రణపై విజయనగరంలో ధర్నా కార్యక్రమం




ఒంగోలులో నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా లోక్‌సత్తా అధ్యక్షుడు
అల్లూరి శివ రమేష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, తదితరులు




యువసత్తా ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన యూత్ అసెంబ్లీలో
రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీరాజు, అసెంబ్లీ మాజీ స్పీకర్ ఈశ్వర్ రెడ్డి, తదితరులు




మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు డిమాండ్ చేస్తూ విద్యార్థుల దీక్ష



చిలకలూరిపేటలో ప్రజా సమస్యలపై క్షేత్ర పర్యటన చేస్తున్న
లోక్‌సత్తా నాయకులు భానుప్రసాద్

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




వివేకానంద జయంతి సందర్భంగా హైదరాబాద్ రామకృష్ణ మఠంలో
జాతీయ యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad